

నేడు సీఎం జగన్ రాక

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నగరానికి రానున్నారు. ఆయన విజయవాడ నుంచి విమానంలో ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు రుషికొండలోని ఐటీ హిల్ నంబర్-3కు వెళతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన రాడిసన్ బ్లూ హోటల్‌కు 11 గంటలకు చేరుకుంటారు. 'వైజాగ్ విజన్-ఫ్యూచర్ విశాఖ' పేరిట నిర్వహిస్తున్న సదస్సులో పాల్గొంటారు. 12.35 గంటలకు రాడిసన్ నుంచి బయలుదేరి పీఎం పాలెంలోని 'వి' కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ 'ది కాస్కేడింగ్ సిల్క్స్-భవిత' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.55 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి రుషికొండ ఐటీ హిల్-3పైకి చేరుకుని హెలీకాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు వెళతారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విమానంలో విజయవాడ తిరిగి వెళ్లిపోతారు.

విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

- నేటి విజన్ విశాఖ సదస్సుకు 2,000 మంది పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు
- పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ - 4వ పేజీలో

ప్లీజ్... తప్పకుండా రండి!

సీఎం సమావేశం కోసం అధికారుల తిప్పలు

నేడు నగరంలో పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశం

- విజయవంతం చేసే బాధ్యత అధికార యంత్రాంగానికి అప్పగింత
- సరకు రవాణా రంగంలో ఉన్నవారితో పోర్టు సమావేశం
- రంగంలోకి ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఏపీఐఐసీ
- మరోవైపు కలెక్టరేట్ నుంచి ప్రత్యేకంగా ఒక్కొక్కరికీ మూడేసి సార్లు ఫోన్లు
- సమావేశాన్ని రక్తి కట్టించడానికి వైసీపీ భక్తుల్లో ముగ్గురికి ప్రశ్నలు అడిగే అవకాశం
- ఏమి అడగాలో వారికి ముందే సూచన
- వాటికి సమాధానాలు కూడా సిద్ధం


.రాడిసన్ బ్లూ వద్ద పోలీసు బందోబస్తు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖపట్నం పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహిస్తుండడంతో దానిని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం ఆపసోపాలు పడుతోంది. ఇటీవల కాలంలో విశాఖలో సీఎం కార్యక్రమాలను సక్సెస్ చేసే బాధ్యతను అధికారులపై పెడుతున్న సంగతి తెలిసిందే. గత నెలాఖరుల శారదా పీఠానికి వచ్చినప్పుడు విమానాశ్రయం నుంచి చినముషిడివాడ వరకు మహిళలను దారిపొడవునా ఎండలో నిల్చోబెట్టి స్వాగతం పలికించిన సంగతి తెలిసిందే.

రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో 'వైజాగ్ విజన్...ఫ్యూచర్ విశాఖ' పేరుతో మంగళవారం నిర్వహిస్తున్న సమావేశానికి పారిశ్రామికవేత్తలను సమీకరించే బాధ్యతను వైసీపీ పెద్దలు...అధికార యంత్రాంగానికి అప్పగించారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం పోర్టు అధికారులు సరకు రవాణా వ్యాపారంలో ఉన్న వారందరినీ సోమవారం రాత్రి ... మిగతా 4వ పేజీలో


వైసిపి రంగులతో వున్న పరదాలు

బీచ్‌రోడ్డులో పరదాలు!

- సీఎంకు మురుగునీటి కాలువ కనిపించకుండా వైసీపీ జెండా రంగులతో కూడిన పరదాలు ఏర్పాటు
- అధికారుల అత్యుత్సాహం

సాగర్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన సమయంలో అధికారులు ఒక్కొక్కసారి రోడ్డుకు ఇరువైపులా పరదాలు ఏర్పాటుచేస్తుంటారు. ఇప్పటివరకూ ఈ తరహా పరదాలు ఇతరులకు సీఎం కనిపించకుండా, సీఎంకు అవతలివాళ్లు కనిపించకుండా ఏర్పాటుచేస్తూ వచ్చారు. కానీ, మంగళవారం విశాఖ వస్తున్న సీఎంకు ఇక్కడ ఉన్న మురుగునీరు కాలువలు కనిపించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'వైజాగ్ విజన్...ఫ్యూచర్ విశాఖ' పేరుతో రుషికొండలోని రాడిషన్ బ్లూ హోటల్‌లో నిర్వహించే సమావేశానికి సీఎం హాజరవుతున్నారు. అయితే హోటల్ దాటిన తరువాత గిరిజన భవన్‌కు ఆనుకుని మురుగునీటి కాలువ, సూయిజ్ ప్లాంట్ ఉన్నాయి. అవి రెండూ కనిపించకుండా అధికారులు వైసీపీ జెండా రంగులతో కూడిన పరదాలను ఎత్తుగా ఏర్పాటుచేశారు. మురుగునీటి కాలువ కూడా సీఎంకు కనపడకుండా చేయాల్సినంత అవసరం ఏమొచ్చిందని స్థానికులు ఆశ్చర్యపోతున్నారు.


ఆనందపురం మండలంలో యంత్రాలతో కొండను తవ్వుతున్న దృశ్యం

కొండకు ఎసరు

జగనన్న కాలనీకి ఇచ్చింది 4 ఎకరాలు..

ఆక్రమించుకున్నది 10 ఎకరాలు!

- ఆనందపురం మండలంలో భూ కబ్జా
- వైసీపీ నేతల నేతృత్వంలోనే కార్యక్రమం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)


కొండ తవ్వకం

ఆనందపురం మండలంలో వైసీపీ నేతల అండదండలతో కొందరు కొండను ఆక్రమించేస్తున్నారు. వందల కొద్దీ లారీల మట్టిని తవ్వి అమ్ముకోవడమే కాకుండా సుమారు రూ.50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారు. ఇదంతా జగనన్న కాలనీ పేరుతో చేయడం గమనార్హం.

జగనన్న కాలనీ కోసం ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ పరిధిలోని నగరంపాలెం గ్రామంలో 22 మంది రైతుల నుంచి మూడేళ్ల క్రితం నాలుగు ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. అది ప్రభుత్వ భూమే. ఆక్రమించుకుని ఉండడంతో వారికి ఒక్కొక్కరికి ఐదు సెంట్లు చొప్పున భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. సేకరించిన భూమిలో 177 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఈ 22 మందికి ఐదు సెంట్ల భూమి ఇచ్చారు. అయితే తమకు భూమి ఇవ్వలేదని మరికొందరు తెరపైకి వచ్చారు. వారిని ఎంపీపీ రెవెన్యూ అధికారుల వద్దకు తీసుకువెళ్లి, పరిహారం అందలేదని చెప్పారు. పరిశీలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. వారితో పాటు పాత 22 మంది కలిసి తర్లువాడ పంచాయతీ నగరపాలెం సర్వే నంబరు 162లో కొండను తవ్వడం ప్రారంభించారు. జాతీయ రహదారికి కూత వేటు దూరంలో ఉన్న ఈ కొండ వద్ద ఎకరా రూ.5 కోట్లు విలువ ఉంది. సుమారు పది ఎకరాల వరకూ చదును చేసేశారు. ఎవరికి నచ్చినంత వారు ఆక్రమించుకుంటున్నారు. ఇప్పటివరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రైతుల నుంచి సేకరించిన భూమి నాలుగు ఎకరాలు అయితే వారు పది ఎకరాలు ఆక్రమించడం ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు. ఇదంతా వైసీపీ నేతల ... మిగతా 4వ పేజీలో

అడ్డగోలు ఎజెండా

- రూ.50 లక్షలలోపు పనులకు ఆమోదం తెలిపేందుకు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీకి అధికారం
- అందుకోసం రెండేసి కోట్ల రూపాయల విలువైన పనులు నాలుగు ముక్కలు చేసి ఎజెండాలో చేరుస్తున్న వైనం
- గత కొద్దికాలంగా ఇదే వరుస...
- ఈనెల ఆరున స్టాండింగ్ కమిటీ సమావేశం
- మరోమారు అదేవిధంగా ప్రతిపాదనలు

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) స్టాండింగ్ కమిటీ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.50 లక్షల కంటే తక్కువ విలువైన పనులకు సంబంధించిన అంశాలపై మాత్రమే కమిటీ నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. అయితే అందుకోసం ఒకే పనిని రూ.50 లక్షల కంటే తక్కువ ఉండేలా విడదీసి ఎజెండాలో చేర్చి ఆమోదించేస్తున్నారు. బుధవారం స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటుచేసేందుకు జీవీఎంసీ కార్యదర్శి పి.నల్లనయ్య ఏర్పాట్లు చేస్తున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే సమావేశం కోసం 68 అంశాలతో ఎజెండా తయారుచేసి సభ్యులకు అందజేశారు. ముడసర్లోవ పార్కులో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా మౌలిక సదుపాయాల కల్పన, సివిల్ వర్కుల కోసం దాదాపు రూ.రెండు కోట్లతో గతంలో ప్రతిపాదనలు తయారుచేశారు. దీనిని ఆమోదించాలంటే కౌన్సిల్‌లో పెట్టాలి. దాంతో ఆ పనిని నాలుగు ముక్కలుగా చేసి స్టాండింగ్ కమిటీ ఎజెండాలో చేర్చారు. అలాగే హనుమంతవాక జంక్షన్ నుంచి నార్త్ స్టార్ హోమ్స్ వైపు కొండ నుంచి చరియలు, రాళ్లు జారిపడిపోతున్నందున అక్కడి భవనాలకు నష్టం జరుగుతోందంటూ దాదాపు రూ.రెండు కోట్ల అంచనా వ్యయంతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదన తయారుచేశారు. అంత విలువైన పనిని ఆమోదించాలంటే కౌన్సిల్‌లో పెట్టాల్సి ఉంటుంది కాబట్టి దానిని కూడా నాలుగు ముక్కలుగా విడగొట్టి ఎజెండాలో చేర్చారు. అలాగే జోన్-2 పరిధి ఎనిమిదో వార్డు తారకరామ నగర్ శాటిలైట్ టౌన్‌లోని రుషికొండ లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లో ... మిగతా 4వ పేజీలో

రోడ్డుపైనే దుకాణం

వైసీపీ నేతల ఇష్టారాజ్యం

- దారులు మూసేసి సమావేశాలు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న పోలీసులు

విశాఖపట్నం/మాధవధార, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):

నగరంలో వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన నాయకులే కొత్త సమస్యలు సృష్టిస్తున్నారు. ప్రధాన రహదారులను ఆక్రమించి, అడ్డంగా వేదికలు నిర్మించి, సమావేశాలు ఏర్పాటుచేస్తున్నారు. మొన్నటికి మొన్న విశాఖ ఉత్తర నియోజకవర్గ


మాధవధారలో నడిరోడ్డుపై స్టేజి నిర్మాణం

సమన్వయకర్త కేకే రాజు పోర్టు ఆస్పత్రి మార్గంలో ప్రధాన రహదారిని మూసేసి బహిరంగ సభ నిర్వహించారు. దాంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడ్డారు. తాజాగా అదే నియోజకవర్గంలోని మాధవధార వుడా కాలనీలో ఆ పార్టీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి...స్థానికులను ఇబ్బందిపెట్టేలా వ్యవహరించారు. ప్రపంచ మహిళా దినోత్సవం ఈ నెల 8వ తేదీన కాగా...నాలుగు రోజులు ముందుగానే తన ప్రాంతంలో కార్యక్రమం ఏర్పాటుచేశారు. తమ పార్టీ నాయకులను ఆహ్వానించారు. వుడా కాలనీ ప్రధాన రహదారిలో అడ్డంగా సోమవారం ఉదయం స్టేజీ ఏర్పాటు చేయించారు. దాంతో ఆ మార్గంలో తిరిగే 48ఏ బస్సులన్నీ ఆగిపోయాయి. విద్యా సంస్థల బస్సులు వేరే మార్గంలో వెళ్లిపోయాయి. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే మార్గం లేకపోయింది. సాయంత్రం ఐదు గంటలకు జరిగే కార్యక్రమానికి ఉదయం నుంచి రహదారి బ్లాక్ చేశారు. దీనిపై స్థానికులు కొందరు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి స్టేజీ పక్క నుంచి కొంత మార్గం కల్పించారు. అయితే సాయంత్రం మళ్లీ రాకపోకలు ఆపేశారు. అధికారం చేతిలో ఉంది కదా...అని ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తున్నారని, ఏ కళ్యాణ మండపంలోనే కార్యక్రమం పెట్టుకోకుండా రోడ్డుపై ఏర్పాటుచేసి అందరినీ ఇబ్బందులకు గురిచేయడం ఏమిటని జనం అసంతృప్తి వ్యక్తంచేయడం కనిపించింది.


రహదారిపైనే సభ నిర్వహణ

గాజువాక వైసీపీలో కుమ్ములాట

నాగిరెడ్డి X చందు

- రెండు వర్గాలుగా చీలిపోయిన నేతలు
- చందూకు కాకుండా టికెట్ ఎవరికి ఇచ్చినా అభ్యంతరం లేదంటున్న సిట్టింగ్ ఎమ్మెల్యే
- మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేరు సిఫారసు
- సమన్వయకర్తకు కొందరు కార్పొరేటర్లు మద్దతు
- వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహణ
- ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి వద్దకు చేరిన పంచాయితీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గాజువాక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. నియోజకవర్గ సమన్వయకర్తను మార్చినప్పటి నుంచి నివురుగప్పిన నిప్పులా వున్న వైషమ్యాలు ఇప్పుడు బయటపడుతున్నాయి. ఎవరికి వారు వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారంటూ ఒకరిపై ఒకరు బహిరంగంగానే విమర్శలు చేసుకుంటున్నారు. మరో నెల రోజుల్లో ఎన్నికలు జరగబోతుంటే నేతల మధ్య ఈ కుమ్ములాటలు ఏమిటంటూ కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు.


తిప్పల నాగిరెడ్డి


ఉరుకూటి చందు

2019 ఎన్నికల తర్వాత గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తనయుడు దేవన్‌రెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు. రెండు నెలల కిందట దేవన్‌రెడ్డిని సమన్వయకర్తగా తొలగించిన అధిష్ఠానం...ఆ స్థానంలో 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు(చందు)ను నియమించింది. వచ్చే ఎన్నికల్లో రామచంద్రరావే గాజువాక నుంచి పోటీకి దిగుతారని పార్టీలో ప్రచారం జరిగింది. దీనిపై ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితోపాటు ఆయన కుమారుడు దేవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. విషయం అధిష్ఠానం దృష్టికి చేరడంతో నాగిరెడ్డితోపాటు ఆయన ఇద్దరు కుమారులను తాడేపల్లి పిలిచి బుజ్జగించింది. అక్కడి నుంచి తిరిగి వచ్చిన తర్వాత కూడా టికెట్ తమకే ఇవ్వాలని...ఒకవేళ వీలుకాని పక్షంలో ఉరుకూటి చందుకు తప్ప వేరెవరికి ఇచ్చినా అభ్యంతరం లేదని నాగిరెడ్డి స్పష్టంచేశారు. ఈ పరిణామంతో ఉరుకూటి చందును మార్చేస్తారని, ఆయన స్థానంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ లేదంటే మేయర్ గొలగాని హరివెంకటకుమారిని నియమిస్తారని ప్రచారం జరిగింది. అయితే ఆ తర్వాత గాజువాకలో జరిగిన కార్యక్రమానికి వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి హాజరై అభ్యర్థి చందూయేనని ప్రకటించారు. ఆ కార్యక్రమం ముగిసిన వెంటనే ఎమ్మెల్యే నాగిరెడ్డి వేరొకచోట తన అనుచరులు, పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేసి సమన్వయకర్తగా నియమించినంత మాత్రానా ఎన్నికల్లో అభ్యర్థి అయిపోరని, ఎన్నికల్లోపు ఎటువంటి మార్పులైనా జరగవచ్చునని పునరుద్ఘాటించారు. చందూ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ యాదవ సామాజిక వర్గానికి మాత్రమే గాజువాక టికెట్ ఇవ్వదలిస్తే జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేరు పరిశీలించాలంటూ సూచించారు. ఈ క్రమంలోనే గత పది రోజులుగా మేయర్ గొలగాని హరివెంకటకుమారితో గాజువాక నియోజకవర్గంలో కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నారు. అదే సమయంలో సమన్వయకర్త హోదాలో చందూ నిర్వహించే కార్యక్రమాలకు ఎమ్మెల్యే నాగిరెడ్డి గైర్హాజరవుతున్నారు. ఆదివారం నియోజకవర్గంలో ఉరుకూటి చందు నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగిరెడ్డి హాజరుకాలేదు. అదే సమావేశానికి మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, ... మిగతా 4వ పేజీలో

భూ కబ్జాలపై 'ప్రత్యేక స్పందన' రేపు

- అన్ని స్టేషన్లలోనూ ఫిర్యాదులు స్వీకరణ
- ఇన్‌చార్జులుగా ఏసీపీ స్థాయి అధికారుల నియామకం
- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్



విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):

నగర పరిధిలో భూ కబ్జాలపై బాధితులు, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఈనెల ఆరో తేదీన ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సీపీ రవిశంకర్ అయ్యన్నార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర కమిషనరేట్ పరిధిలోని అన్ని స్టేషన్లలోనూ బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. వాటిని పరిశీలించి, తక్షణం పరిష్కరించేందుకు వీలుగా ప్రతి స్టేషన్‌కు ఏసీపీ, అంతకంటే పైస్థాయి అధికారి ఒకరిని ఇన్‌చార్జిగా నియమించామన్నారు. ఫిర్యాదులపై సత్వర విచారణ నిర్వహించడంతోపాటు దోషులను గుర్తించి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమనుకుంటే పీడీ యాక్ట్, నగర బహిష్కరణ శిక్ష అమలు చేస్తామన్నారు. భూకబ్జాలకు పాల్పడే వారితోపాటు వారికి సహకరించే ప్రభుత్వ/ప్రైవేటు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. పీఎం పాలెం స్టేషన్ పరిధిలో ఎక్కువ భూకబ్జా ఫిర్యాదులు ఉండడంతో జాయింట్ సీపీని ఇన్‌చార్జిగా నియమించామన్నారు. అలాగే భీమిలి స్టేషన్‌కు డీసీపీ-1, దువ్వాడ స్టేషన్‌కు డీసీపీ-2, ఆరిలోవ స్టేషన్‌కు క్రైమ్ డీసీపీని ఇన్‌చార్జిగా నియమించామన్నారు.

ఘనంగా విద్యుత్ లైన్‌మెన్ దివస్



మాట్లాడుతున్న సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సీతమ్మధార, మార్చి 4: సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ వారి నేతృత్వంలో టాటా పవర్ ఢిల్లీ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ సోమవారం ఢిల్లీలో సేవా సురక్ష స్వాభిమాన్ పేరుతో దేశవ్యాప్తంగా లైన్‌మేన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో విశాఖపట్నం సర్కిల్ కార్యాలయం నుంచి సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్ ఇమ్మడి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ నుంచి ఉత్తమ అవార్డులు తీసు కున్న లైన్‌మేన్లుచొడ్డెం రాధాకృష్ణ (బట్టాయగూడెం), మీసాల రామస్వామి (ఆమదాలవలస), టేకి కొండాచారి (సంపత్‌నగరం)లకు ఆయన అభినందనలు తెలిపారు. లైన్‌మేన్ల సేవలను ప్రశంసించారు. భద్రత నియమాలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. సర్కిల్ పరిధిలోని వినియోగదారులకు విశేష సేవలందించిన 17 మందికి ఉత్తమ లైన్‌మేన్ అవార్డులనుఅందజేశారు. కార్యక్రమం లో డైరెక్టర్ ఆపరేషన్స్ పి.శ్రీనివాసమూర్తి, ఎస్ఈ ఎల్.మహీంద్రనాథ్ పాల్గొన్నారు.



ఢిల్లీలో అవార్డు తీసుకున్న లైన్‌మేన్లు

మహిళలు మరింత విజయపథంలో పయనించాలి

» రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కిరణ్ బేడీ



జ్యోతి వెలిగిస్తున్న కిరణ్‌బేడీ

మహారాణిపేట, మార్చి 4: మహిళలు తమ శక్తి, పనిసామర్థ్యాలను మరింతగా మెరుగుపరుచుకుని విజయ పథంలో పయనించాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ అన్నారు. హోటల్ నోవాటెల్‌లో లుక్ ఆఫ్ ట్రెండ్ అడ్వర్‌టైజింగ్ అండ్ మార్కెటింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంతో మంది మహిళలు విభిన్న రంగాలలో అద్భుతమైన విజయాలు సాధించారన్నారు. గతంలో స్త్రీ , పురుషుల వేతనాల మధ్య వ్యత్యాసం ఉండేదని, ఇప్పుడు ఆ తేడాలేకుండా అందరినీ సమానంగా చూస్తున్నారు. కార్యక్రమంలో ఐఎస్ఎస్‌వీ తార, పాతరవల్లి స్వాతి, డాక్టర్ మేడపాటి వినీల పాల్గొన్నారు

1500 మంది ఓటర్లు దాటితే అనుబంధ పోలింగ్ కేంద్రం

» కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, మార్చి 4: ఓటర్ల సంఖ్య 1500 దాటితే ఆ ప్రాంతంలో పోలింగ్ కేంద్రానికి అనుబంధంగా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ఏ మల్లికార్జున అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని స్పష్టంచేశారు.ఎన్నికల జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందించినట్టు, రాజకీయ పార్టీలు, ప్రజల సహకారంతో ఎన్నికల ప్రక్రియను సమర్థంగా నిర్వహిస్తామని అన్నారు. రాజకీయ పార్టీలు సూచనలు, సలహాలను కోరారు. నియోజకవర్గం స్థాయి సమావేశాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. జిల్లాలో 1941 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల ఐసీయూ వార్డును సిద్ధం చేయాలి

మహారాణిపేట, మార్చి 4: కేజీహెచ్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ ఏ మల్లికార్జున సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల వార్డులో ఆధునికీకరిస్తున్న ఐసీయూ వార్డును పరిశీలించారు. పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆ యూనిట్‌లో కల్పిస్తున్న మౌలిక వసతులు , సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక సౌకర్యాలతో చిన్న పిల్లల వార్డు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు ఈసందర్భంగా తెలిపారు. ఆస్పత్రి ఓపీ గేటు వద్ద ఆర్చ్ నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డా బుచ్చిరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



కేజీహెచ్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

'జగనన్నకు చెబుదాం'కు 226 అర్జీలు

మహారాణిపేట, మార్చి 4: అర్జీదారుల సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని జా యింట్ కలెక్టర్ కే మయూరి అశోక్ అధి కారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీక రించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వారినుంచి 226 వినతులను స్వీ కరించారు. అందులో రెవెన్యూ విభాగానికి చెందినవి 72, జీవీఎంసీకి 60, పోలీసుశాఖకు చెందినవి 16 ఇతర విభాగాలకు చెందినవి 78 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో కె మోహన్‌కుమార్ , రెవెన్యూ , పోలీసు, జీవీఎంసీ ఇతర అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జేసీ, అధికారులు

దాడికి యత్నించిన రౌడీ షీటర్ అరెస్టు

సీతంపేట, మార్చి 4: మద్యం తాగి కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించడంతోపాటు, మరోవ్యక్తిపై దాడికి ప్రయత్నించిన రౌడీషీటర్‌ను నాలుగోపట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి ప్రాంతానికి చెందిన పొలిమేర రాఘవేంద్ర స్వామి, శ్రీనివాసరావు, అలియాస్ దుబాయ్ శ్రీను చిన్ననాటి స్నేహితులు. వీరిద్దరికి ఆర్థిక లావాదేవిలు ఉన్నాయి. రాఘవేంద్ర స్వామి తన అవసరమై కొంత డబ్బు దుబాయ్ శ్రీను వద్ద వాడుకున్నాడు. అయితే, ఆర్థిక పరిస్థితి బాగాలేక డబ్బు ఇవ్వలేకపోయాడు. అడిగితే పలుమార్లు తిప్పాడు. దీంతో ఈ నెల 3వ తేదీన దుబాయ్ శ్రీను.. మద్యం తాగుదామని రాఘవేంద్రస్వామిని పిలిచాడు. ఈ క్రమంలో డబ్బు ప్రస్తావవచ్చింది. ఉన్నప్పుడు ఇస్తానని చెప్పడంతో దుబాయ్ శ్రీను బూతులు తిడుతూ బీరు సీసాతో రాఘవేంద్ర స్వామిపై దాడికి ప్రయత్నించాడు. బార్‌లో వీరిద్దరూ గలాటా చేశారు. అనంతరం అక్కడి నుంచి తప్పించుకున్న రాఘవేంద్ర స్వామి నాలుగో పట్టణ పోలీసులకు సోమవారం దుబాయ్ శ్రీనుపై ఫిర్యాదు చేశాడు. సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు. స్టేషన్ ఎస్ఐ మీసాల సూర్యారావు దర్యాప్తు చేపట్టి శ్రీనుపై 307, 233, 234, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా, ఆదివారం మద్యం తాగి అక్కయ్యపాలెం రోడ్డు పైనున్న బార్ వద్ద దు బాయ్ శ్రీను మద్యం తాగి అండర్‌వేర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోలీసులు అతనిని అడ్డుకొని ప్రశ్నించారు. దీంతో విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దుబాయ్ శ్రీను తిరగబడి విధులను ఆటంకం పరిచాడు. పోలీసులు శ్రీనుపై ఈ కేసు నమోదు చేశారు.

వన్నె తగ్గని ఘంటసాల గాన మాధుర్యం

» ప్రముఖ సినీనటుడు సుమన్



ఎన్ఆర్ఐ జి.దాముకు ఘంటసాల స్మారక పురస్కారం ఇస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, మార్చి 4: సినీ రంగానికి ఘంటసాల అందించిన సేవలు మరపురానివని ప్రముఖ సినీనటుడు సుమన్ కొనియాడారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల గ్లోబల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ టి. శరత్‌చంద్ర ఐడియల్ గాంధర్వ లోగో ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుమన్ ఎన్ఆర్ఐ జి.దాముతో కలిసి జ్యోతి ప్రజల్వన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఘంటసాల తన గాత్రమాధుర్యంతో జనాల మనస్సుల్లో నిలిచిపోయారన్నారు.ఆయనను తరతరాలు గుర్తుంచుకుంటున్నారు. తెలుగు సినీ చరిత్రలో ఆయన ఎందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఆయన మనమధ్యన లేకపోయిన ఆయన గాత్రం నిరంతరం ఉంటూనే ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయి స్వరపోషకులు జి.దాముకు జీవిత సాఫల్య పురస్కారం సుమన్ చేతులమీదుగా అందజేశారు. శివారెడ్డి మిమిక్రీ అలరించింది. కార్యక్రమంలో ఘంటసాల స్మారకపీఠం స్వరపోషకులు ఎంఎస్ రాజు, వంకాయల సన్యాసిరాజు కె.సుధారాణి, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.డాక్టర్ టి.శరత్‌చంద్ర సంగీత సారథ్యంలో ఘంటసాల ఆలపించిన చిత్రాల్లో గీతాలను ఆలపించారు.

ఎరుకుమాంబ ఆలయంలో శివరాత్రికి ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో పాల్గొన అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు

సీతంపేట, మార్చి 4: దొండపర్తిలో ఎరుకుమాంబ దేవస్థానంలో ఈ నెల 8తేదీన మహాశివరాత్రి వేడుకలను నిర్వహణకు విస్తృత ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం ఆలయంలో వివిధ విభాగాల అధికారులతో సీతమ్మధార డిప్యూటీ తహసీల్దార్ ఎస్ఏ త్రినాధరావుఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారి దర్శనానికి వీలుగా తగిన క్యూలైన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తాగునీరు, మజ్జిగ సరఫరా, మహాశివరాత్రి రోజున భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, శాంతి భద్రతలు, పారిశుధ్య పనుల కల్పనపై చర్చించారు. సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జీవీ రమాబాయి, డిప్యూటీ తహసీల్దార్ ఎస్ఏ తిన్నాధ రావు, నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ ఐ.గంగాధర్, ఫైర్ స్టేషన్ హెచ్‌సీ సి.గోవిందరావు, కానిస్టేబుల్ రవికుమార్, జీవీఎంసీ ఏఎంహెచ్ ఓ సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎంఎస్ దొర, వీఆర్ఓ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ హత్య కేసులో నిందితులకు రిమాండ్

కొమ్మాది, మార్చి 4 : మధురవాడలోని బక్కన్నపాలెంనకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయి పవన్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్టు పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ సీఐ వై. రామకృష్ణ తెలిపారు. సాయి పవన్ హత్య కేసులో నిందితులు షణ్ముఖ తేజ, కారు డ్రైవర్ వినోద్‌ను పీఎం పాలెం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు వారిని అదుపులోకి విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారు.

పాఠశాలను పరిశీలించిన ఎన్‌సీఆర్‌టీ బృందం

జగదాంబ కూడలి, మార్చి4: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ ట్రైనింగ్ సంస్థకుచెందిన న్యూఢిల్లీ (ఎన్‌సీఆర్‌టీ) ప్రతినిధుల బృందం సోమవారం పూర్ణామార్కెట్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీలు, పాఠశాలలో విద్యార్థులకు సంబంధించి వసతులు, విద్యా ప్రమాణాలపై ఎన్‌సీఆర్‌టీ హెడ్ ప్రొఫెసర్ వి.పి. సింగ్ ఆధ్వర్యంలో ఆరా తీశారు. ఇక్కడ నిర్వహిస్తున్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, వసతులపై జీవీఎంసీ ఏపీడీవో, కార్యకర్తలతో మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం రవికుమార్ పిల్లలకు అందిస్తున్న బోధనతదితర అంశాలు వివరించారు. హెడ్ ప్రొఫెసర్ వి.పి సింగ్ అంగన్‌వాడీలకు వంట గదులు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.డైట్ ప్రిన్సిపాల్, టీచర్లు, ట్రైనీ విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్ణామార్కెట్ వద్ద పాఠశాలలో ఎన్‌సీఆర్‌టీ హెడ్ ప్రొఫెసర్ వి.పి. సింగ్

టెట్, టీఆర్‌టీకి మధ్య వ్యవధిపై తీర్పు.. జేఏసీ హర్షం

అక్కయ్యపాలెం, మార్చి 4: టెట్‌కు టీఆర్టీకి మధ్య వ్యవధి ఉండాలని హైకోర్టు తీర్పు నివ్వడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పరీక్షలకు మధ్య నెల రోజులు చదువుకునేందుకు వీలుగా సమయం కావాలని రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ ఓదార్పు యాత్ర ద్వారా అభిప్రాయ సేకరణ చేసి నివేదికను మీడియా ద్వారా సమర్పించామన్నారు. దీనికి స్పందించి హైకోర్టు నిరుద్యోగుల సమస్యను అర్థం చేసుకు నెల రోజులు ఈపరీక్షల మధ్య వ్యవధి ఉండాలని తీర్పు నిచ్చినట్టు చెప్పారు.

ఘనంగా మహిళా దినోత్సవం

మాధవధార, మార్చి 4 ; గ్రేటర్ 51వవార్డులో సోమవారం వైసీపీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.రమణికుమారి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్, ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి, గాజువాక ఎమ్మెల్యే టి.నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరదు కల్యాణి, నగర అధ్యక్షులు కె.గురువులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, కార్పొరేటరు ఆర్. వెంకటరమణ తదితరులు హాజరయ్యారు. బొత్స ఝాన్సీతోపాటు ఇతర మహిళా నేతలు, అతిథులను సన్మానించి మెమెంటోలు అందించారు. ఈ సమావేశ వేదిక మాధవధార ఉడాకాలనీ సమీపాన మెయిన్ రోడ్డుపై ఎంపిక చేయడంతో జనాలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం స్కూలు బస్సులు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు, బైక్‌లు నిలిచిపోయాయి.



మేయరుకి, బొత్స ఝాన్సీకి మెమెంటో అందిస్తున్న వరుదు కల్యాణి, రమణి కుమారి

పోలీసు కమిషనరేట్ స్పందనలో 72 ఫిర్యాదులు

మహారాణిపేట, మార్చి 4: పోలీసు కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 72 ఫిర్యాదులు వచ్చాయి. అధికారులు ఫిర్యాదుదారులనుంచి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరంగా పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో డీసీపీలు వీఎన్ మణికంఠ చందోల్, ఎం సత్తిబాబు,పల్లా వెంకటరత్నం, ఎంఆర్‌కె రాజు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో న్యాయం చేయాలని నిరసన

విశాఖపట్నం, మార్చి 4: పదోన్నతుల్లో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ఇంజనీర్స్ అసోసియేషన్ సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నగరంలోని చీఫ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పదోన్నతుల్లో అన్యాయం జరిగిందని, ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గరుగుబెల్లి రామచంద్రరావు మాట్లాడుతూ ఇంజనీర్ల పదోన్నతుల విషయంలో వివిధ రూపాల్లో పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసనలు ప్రదర్శిస్తామని, 7న విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని చెప్పారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేవీఎన్ స్వర్ణకుమార్, డీఈఈ, ఏఈఈ, ఈఈలు పాల్గొన్నారు.

జనసేన ప్రచారం

జగదాంబ కూడలి, మార్చి 4: దక్షిణ నియోజవర్గంలో జనసేన పార్టీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది.ఆపార్టీ నాయకుడు, కార్పొరేటర్ కందుల నాగరాజు సోమవారంమెయిన్ రోడ్డు ఆంజనేయస్వామిగుడి నుంచి పూర్ణామార్కెట్ వరకు రోడ్డు పక్కన ఎండలో వ్యాపారాలు సాగిస్తున్న వారికి పార్టీ గుర్తుతో ఉన్న పెద్ద వ్యాపార గొడుగులను అందజేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రామికనగర్‌లో సులాభ్ కాంప్లెక్స్ ప్రారంభం

అక్కయ్యపాలెం, మార్చి 4 : గ్రేటర్ 44వ వార్డు శ్రామికనగర్‌లో రూ.14 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సులాబ్ కాంప్లెక్స్‌ను సోమవారం జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత స్థానికులు చాలా ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని దీన్ని నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ రమణమ్మ, కన్వీనర్లు ఆదినారాయణ, పి.గోపి పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్ పేరుతో ఘరానా మోసం

» రూ.64 లక్షల మోసపోయిన నగరవాసి

» సైబర్ పోలీసుల అదుపులో నిందితులు

ఎండాడ, మార్చి 4: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయంటూ నమ్మించి కొంతమంది మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్ నంబర్‌ను గ్రూపుల్లో చేర్చి, లింక్‌లు పంపించి వాటి ద్వారా ముగ్గులోకి దింపుతున్నారు. నగరానికి చెందిన వ్యక్తి అటువంటి మోసానికే గురయ్యారు. విశాలాక్షినగర్‌కి చెందిన ఒక వ్యక్తికి వాట్సాప్ గ్రూపులో ఇన్విటేషన్ లింక్ వచ్చింది. దాని పేరు స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా ఉంది. అందులో సంబంధిత వ్యక్తి చేరగా...అజీమ్‌సింగ్ అనే వ్యక్తి స్టాక్స్ కొనుగోలు, అమ్మకానికి సంబంధించి ఉపన్యాసాలు ఇచ్చేవాడు. అతను...జోక్సా ప్లాట్‌ఫామ్‌లో ఫారిన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్‌గా ట్రేడర్ సీటు తీసుకోవాలని బాధితునికి సూచించాడు. అది తీసుకుంటే మార్కెట్‌లో అధిక రాబడి వస్తుందని నమ్మబలికాడు. అతని మాటలు విని దఫదఫాలుగా రూ.64 లక్షల వరకూ డిపాజిట్ చేసి మోసపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన సైబర్ క్రైమ్ పోలీసులు అతడు డిపాజిట్ చేసిన కొంత నగదు నగరానికి చెందిన ఒక వ్యక్తి ఖాతాలోకి వెళ్లినట్టు గుర్తించారు. ఆయన ఖాతా నుంచి హైదరాబాద్‌లోని మరికొన్ని అకౌంట్స్‌లోకి వెళ్లినట్టు గుర్తించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన చివికుల వెంకట అనిల్, అనుగూరు మనోహర్, తాళ్లబత్తుల సతీష్ కుమార్, ఒడిశాకు చెందిన శరత్ చంద్ర బెహరా, విశాఖకు చెందిన యడ్ల నాగేశ్వరరావులను అదుపులోకి తీసుకున్నారు. వారంతా యూఎస్‌డీటీ క్రిప్టో ట్రేడింగ్ చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.

ప్లీజ్... తప్పకుండా రండి!

... 3వ పేజీ తరువాయి

నోవాటెల్‌లో సమావేశపరిచి సీఎం సమావేశానికి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. అలాగే ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) వంటి సంస్థల నుంచి సభ్యులు అంతా హాజరు కావాలని కోరారు. ఇది కాకుండా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రతి పారిశ్రామికవేత్తకు ఫోన్ చేసి సీఎం సమావేశానికి రావాలని కోరుతున్నారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకూ జరిగే ఈ కార్యక్రమానికి ఉదయం 10 గంటలకే హాజరు కావాలని, దీనికి పాస్‌లు కూడా ఇస్తున్నామని చెబుతున్నారు. వస్తున్నారా?, లేదా?...అంటూ కన్‌ఫర్మేషన్ కూడా తీసుకుంటున్నారు. ఇలా ఒక్కో పారిశ్రామికవేత్తకు మూడేసిసార్లు ఫోన్లు చేస్తున్నారు. మరోవైపు ఏపీఐఐసీకి చెందిన అధికారులు కూడా వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెడుతున్నారు. సమావేశాన్ని విజయవంతం చేసే బాధ్యతను అధికారుల భుజాలపై వేశారు. పార్టీ నాయకులు పిలిస్తే వచ్చే పరిస్థితి లేకపోవడం వల్లే అధికారులపై ఆధారపడ్డారు. ఐటీ, టూరిజం, లాజిస్టిక్స్, ఆక్వా, సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ ఆస్పత్రులు, రియల్ ఎస్టేట్...ఇలా అన్ని రంగాలకు చెందిన వారిని ఈ సమావేశానికి తీసుకురావాలని, అక్కడి 'సాగరిక' సమావేశ మందిరాన్ని కిటకిటలాడేలా చేయాలని యత్నిస్తున్నారు. సమావేశాన్ని రక్తి కట్టించడానికి వైసీపీ భక్తుల్లో ముగ్గురికి ప్రశ్నలు అడిగే అవకాశం కల్పించారు. ఏమి అడగాలో వారికి ముందే సూచించారు. వాటికి సమాధానాలు కూడా ముందే సిద్ధం చేసుకున్నారు. సీఎం సమావేశం నేపథ్యంలో తమను ఉద్యోగాలకు, కాలేజీలకు వెళ్లనిస్తారా?, లేదా?...అని రుషికొండ మార్గంలో రెగ్యులర్‌గా వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు.

కొండకు ఎసరు

... 3వ పేజీ తరువాయి

కనుసన్నల్లోనే జరగడంతో అధికారులు నోరు మెదపలేకపోతున్నారు. ఈ విషయమై స్థానిక వీఆర్‌ఓను వివరణ కోరగా, ఫిర్యాదు అందిన వెంటనే వెళ్లి పనులు ఆపించానని చెప్పారు. గత తహసీల్దార్‌కు, ప్రస్తుత తహసీల్దార్‌కు ఇవన్నీ తెలుసునని గ్రామస్థులు చెబుతున్నారు.

గాజువాక వైసీపీలో కుమ్ములాట

... 3వ పేజీ తరువాయి

కార్పొరేటర్లు బీఎన్ పాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు హాజరయ్యారు. ఎమ్మెల్యే నాగిరెడ్డికి వ్యతిరేకంగా సమావేశంలో కొందరు మాట్లాడినట్టు వార్తలు వచ్చాయి. దీంతో నియోజకవర్గంలో నేతలు రెండు వర్గాలుగా చీలిపోయారని స్పష్టమైంది. ఎన్నికలకు ఇంకా నెల రోజులు మాత్రమే వ్యవధి ఉన్న తరుణంలో నేతలు ఎవరి దారి వారిదే అన్నట్టు వ్యవహరిస్తుండడంతో పార్టీ గెలుపు కష్టమేనని కార్యకర్తలే అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుండగా ఎమ్మెల్యే నాగిరెడ్డి తీరుపై సమన్వయకర్త చందుతోపాటు కొంతమంది కార్పొరేటర్లు సోమవారం ఎండాడలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీనిపై ఆయన స్పందిస్తూ మంగళవారం నగరానికి సీఎం జగన్ వస్తున్నందున గాజువాక సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిసింది.

అడ్డగోలు ఎజెండా

... 3వ పేజీ తరువాయి

పార్కు అభివృద్ధి కోసం సుమారు రూ.రెండు కోట్లు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు తయారుచేశారు. దీనిని కూడా నాలుగు ముక్కలుగా విభజించి ఎజెండాలో చేర్చారు. ఇంకా గత ఏడాది వినాయక చవితి సందర్భంగా నిమజ్జనం కోసం ఎనిమిది, తొమ్మిది వార్డుల పరిధిలోని ఐటీ సెజ్, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం బీచ్‌లో లైటింగ్ ఏర్పాటుకోసం రూ.ఏడు లక్షలు ఖర్చు చేసినందున ఆ బిల్లు చెల్లింపునకు స్టాండింగ్ కమిటీ ఆమోదం కోసం ఇప్పుడు ప్రతిపాదించారు. ఆరు నెలల తర్వాత బిల్లు పెట్టడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటితోపాటు ఉద్యోగుల సర్వీసుకి సంబంధించిన అంశాలు, దుకాణాల వేలం, తదితర అంశాలను ఎజెండాలో చేర్చారు.

విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయమే లక్ష్యం

» నేటి విజన్ విశాఖ సదస్సుకు 2,000 మంది పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు

» పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాగర్‌నగర్ (విశాఖపట్నం), మార్చి 4:విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయడమే తమప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సాగర్‌నగర్ సమీపంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో మంగళవారం 'విజన్ విశాఖ' పేరుతో నిర్వహించనున్న సదస్సుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'విజన్ విశాఖ' సదస్సుకు దాదాపు రెండు వేల మంది పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు హాజరుకానున్నారన్నారు. ఈ సందర్భంగా విశాఖపై తన విజన్‌ను రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి తెలియజేస్తారన్నారు. అన్ని రంగాల్లో విశాఖను అభివృద్ధి చేయాలనేది ఆయన లక్ష్యమన్నారు. అలాగే జీవీఎంసీ పరిధిలో రూ.1,500 కోట్లతో చేపట్టనున్న పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారన్నారు. ముడసర్లోవలో జీవీఎంసీకి నూతన భవన నిర్మాణం, కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నగరానికి నీటి సరఫరా, సాగర్‌నగర్ బీచ్ రూ.10 కోట్లతో అభివృద్ధి, వెంకోజీపాలెం నుంచి మేరియట్ హోటల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం వంటి పనులకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు కూడా వెల్లడించనున్నారన్నారు. ఎన్నికల ముందు విజన్ గుర్తువచ్చిందా అని ఓ విలేఖరి అడిగిన ప్రశ్నకు...తమ ప్రభుత్వానికి ముందు నుంచి విజన్ వుందని మంత్రి సమాధానం ఇచ్చారు. ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు ఏర్పాటుకు సిద్ధమవుతోందని, అందుకు ప్రభుత్వం నుంచి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఐటీకి సంబంధించి ఇప్పటికే అనేక కంపెనీలు విశాఖ వచ్చాయన్నారు. అనకాపల్లిలో ఈ నెల ఏడో తేదీన 'వైఎస్ఆర్ చేయూత' కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నట్టు మంత్రి చెప్పారు.

ఏసీబీ వలలో వీఆర్వో

» వీఆర్ఏ కూడా.. » రైతు నుంచి లంచం తీసుకుంటూ చిక్కిన వైనం

నాతవరం, మార్చి 4: నాతవరం తహసీల్దార్ కార్యాలయంలో ఓ రైతు నుంచి లంచం తీసుకుంటున్న వీఆర్వో, వీఆర్ఏలను ఏసీబీ అధికారులు సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ రమ్య తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నాతవరం మండలం గుమ్మిడిగొండ గ్రామా నికి చెందిన అడిగర్ల వంశీకృష్ణ అనే రైతు తన తండ్రి పేరున ఉన్న రెండు ఎకరాల 16 సెంట్ల భూమికి సంబంధించి మ్యూటేషన్, అడంగల్ కరెక్షన్‌కు గుమ్మిడిగొండ గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్వో) జుర్రా సింహాచలం, గ్రామ రెవెన్యూ సహా యకులు(వీఆర్ఏ) చేవళ్ల లోవరాజును సంప్రదించాడు. దీంతో రూ.8 వేలు లంచం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై ఆ రైతు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు ఆ రైతు సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. వీఆర్వో సింహాచలానికి రూ.6 వేలు, వీఆర్ఏ లోవరాజుకు రూ.2 వేలు ఇచ్చాడు. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రాత్రి వరకు తహసీల్దార్ కార్యాలయంలోనే విచారణ జరిపారు. వీఆర్వో, వీఆర్ఏలను మంగళవారం విశాఖలోని ఏసీబీ కోర్టుకు తరలించనున్నట్టు అధికారులు తెలిపారు.



ఏసీబీకి పట్టుబడిన గుమ్మిడిగొండ వీఆర్వో సింహాచలం, వీఆర్ఏ లోవరాజు

నౌకల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై పోర్టు ఒప్పందం

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు నౌకల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం ఎన్‌టీసీపీడబ్ల్యూసీ సంస్థతో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆధునిక సరకు రవాణాలో నౌకల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అత్యంత కీలకమైన అంశం కావడంతో ఈ ఒప్పందం చేసుకున్నట్టు పోర్టు చైర్మన్ అంగముత్తు వెల్లడించారు. ఎన్‌టీసీపీడబ్ల్యూసీ సంస్థ తరఫున ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కుమార్‌రాజు సంతకం చేశారు. ఈ ఒప్పందం విలువ రూ.14.03 కోట్లు కాగా పదేళ్ల ఆ సంస్థ తరఫున సేవలు అందుతాయి. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దుబే, డిప్యూటీ కన్జర్వేటర్ కెప్టెన్ శ్రీనివాస్, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

జ్ఞానాపురం, మార్చి 4: గ్రేటర్ 41వవార్డులో సమస్యలను పరిష్కరిస్తామి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ తెలిపారు.సోమవారం సుబ్బలక్ష్మీనగర్, బాబుకాలనీ, వెంకటరాజు నగర్ ల్లో పర్యటించి రోడ్లు, డ్రైన్లను పరిశీలించారు. డ్రైన్ల వద్ద మురుగునీరు నిల్వ ఉండిపోతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు వెంటనే ఇంజనీరింగ్ సిబ్బందికి తెలయజేసి సమస్య పరిష్కరించారు. వైసీపీనేత శ్రీధర్, డీఈ భరణి, ఎఈ సతీశ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, ప్రభు,వైభవ్ ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ క్యాంటీన్లను తనిఖీ చేసిన అధికారులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 4: స్టీల్‌ప్లాంట్ కోక్-ఓవెన్ క్యాంటీన్‌లను డీజీఎం (హెచ్‌ఆర్) రాధిక, పలువురు అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ప్లాంట్‌లో బయోమెట్రిక్ విధానం అమల్లోకి రానున్నందున కర్మాగారంలో సౌకర్యాల కల్పన విషయంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులుంటే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు తాండ్ర కనకరాజు, యెల్లేటి శ్రీనివాసరావు, సుబ్బారావు, అప్పలనాయుడులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఇళ్ల పట్టాల కోసం ధర్నా

పెందుర్తి, మార్చి 4: నగర పరిధి 97వ వార్డు చినముషిడివాడ సమీపాన వీరానగర్ శివారు ప్రాంతాల్లో పేదల ఆవాసాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమ వారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దశాబ్దకాలంగా ఇళ్లు ఏర్పరుచుకున్న తమకు పట్టాలు ఇవ్వకపోవటం శోచనీయమని నివాసితులు నినాదాలు చేశారు. అనంతరం సమస్యపై తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జగన్, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'లో 12 వినతులు స్వీకరణ

గాజువాక, మార్చి 4: జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో పలు వార్డులకు చెందిన ప్రజలు సమస్యల పరిష్కారం కోరుతూ 12 వినతులను అందజేశారు. వీటిలో ప్రధానంగా పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని, డ్రైనేజీలు నిర్మించాలని, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని, వీధి లైట్లను పునరుద్ధరించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులకు వినతులు అందించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ప్రసాద్‌బాబు, ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంటలో ఐదు..

వేపగుంట: వేపగుంట జోనల్ కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన'కు 5 ఫిర్యాదులు అందాయి. వీటిలో 89వ వార్డు కొత్తపాలెం దరి భగత్‌సింగ్‌నగర్‌లో కాలువ నిర్మించాలని, పురుషోత్తపురం ఏపీఎస్ఈబీ కాలనీలో రహదారి నిర్మాణం పూర్తిచేయాలని, ఫ్యామిలీ సర్టిఫికేట్‌లో తప్పిదాలను సరిచేయాలని, 95వ వార్డు శేషాద్రినగర్ జనచైతన్య లేఅవుట్‌లో సర్వేనెంబరు 56లో రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని, తదితర ఫిర్యాదులందాయి. వీటని సంబంధిత అధికారులకు పంపించి చర్యలు చేపడుతున్నట్టు జెడ్సీ హైమావతి పేర్కొన్నారు.

'లయన్స్' ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం

అగనంపూడి, మార్చి 4: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విజన్ కేర్ సౌజన్యంతో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తొలుత ఈ శిబిరాన్ని స్థానిక అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బి.సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం శిబిరానికి అధిక సంఖ్యలో వచ్చిన ప్రజలకు నేత్ర వైద్యులు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎ.జగదీశ్, కె.హనుమంతరావు, బి.ఈశ్వరరావు, ఎ.వెంకటకృష్ణ, మస్తాన్‌రెడ్డి, కేవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'మహిళల సంక్షేమానికి కేంద్రం కృషి'

గాజువాక, మార్చి 4: మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. నడుపూరులో సోమవారం మహిళలకు గ్యాస్ సిలిండర్లు, కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రతిఒక్కరూ ఆనందంగా ఉండాలనే సంకల్పంతో పలు కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న వాటికి రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోహిణి, భువనేశ్వరి, కృష్ణంరాజు, రమణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **చారి 111**: వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ**: శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13**: లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి**: క్రాంతి
- **రాధా మాధవం**: మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం**: జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్**: శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్**: శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన**: మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్**: రమాదేవి,
- **హనుమాన్**: శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా15, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 32, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 20, క్యారెట్ 24, దొండకాయలు 28, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 110, బరబాటి 20, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 160, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోన 28, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 24, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడిఅల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 117
ఫారం ధర	-- 137
విత్ స్కిన్	-- 244
స్కిన్‌లెస్	-- 254

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

అడుగంటిన భూగర్భ జలాలు

వేసవి ఆరంభంలోనే పారిశ్రామిక ప్రాంతంలోని బావుల్లో పడిపోయిన నీటి మట్టాలు

తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు



షీలానగర్‌లో అడుగంటిన బావి

అక్కిరెడ్డిపాలెం, మార్చి 4: వేసవి తీవ్ర రూపం దాల్చకముందే.. మార్చి మొదటి వారంలోనే పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో షీలానగర్, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, తుంగ్లాం, పరిసర ప్రాంతాల్లో, పలు ఇళ్లల్లో ఉన్న బావులలోని నీటి మట్టాలు గణనీయంగా పడిపోయాయి. అనేక బావులు ఎండిపోయి నీటి మట్టం పాతాళానికి చేరుకోవడంతో తాగునీటి వెతలను ఆయా ప్రాంతాల ప్రజలు వేసవి ఆరంభానికి ముందే ఎదుర్కొంటున్నారు. పలు ఇళ్లల్లో, అపార్టుమెంట్లలో ఉన్న బోరు బావులను తాగునీటి కోసం మోటార్లు ఆన్ చేస్తే పది, పదిహేను నిమిషాలు మాత్రమే ట్యాంకులలోకి నీరు ఎక్కి, ఆ తర్వాత పని చేయడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మంచి నీటి కోసం రోజుకు ఆరేడు సార్లు మోటార్లు వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు. ఇటీవల పారిశ్రామిక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా.. విచ్చలవిడిగా బోరు బావులను వేస్తుండడంతో పాటు వాటర్ ప్లాంట్‌లు అధికం కావడం వల్లే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా అనధికారిక బోరు బావుల తవ్వకాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా నిబంధనలను పాటించని వాటర్ ప్లాంట్‌లపై దృష్టి సారించాలని పేర్కొంటున్నారు. వేసవి ఆరంభంలోనే తాగునీటి ఇబ్బందులు ఈ స్థాయిలో ఉంటే రానున్న రోజుల్లో సమస్య ఎంత తీవ్రంగా ఉంటుందో అర్థం కావడం లేదని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఆటోనగర్ బీ-బ్లాక్‌లో తాగునీటి వెతలు

103 కుళాయిల కోసం జీవీఎంసీకి రూ.14 లక్షలు చెల్లించిన పారిశ్రామికవేత్తలు

ఇప్పటివరకు వేసినవి 53.. ఇందులో 20 కుళాయిల నుంచి తక్కువగా వస్తున్న నీరు

నామమాత్రంగా ఉన్నవి 33..

మిగిలిన 50 కుళాయిల ఊసే లేదాయె..

అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన



నామమాత్రంగా దర్శనమిస్తున్న కుళాయి

ఆటోనగర్, మార్చి 4: ఆటోనగర్ బీ-బ్లాక్‌లో తాగునీటి వెతలు అధికమయ్యాయి. ఈ బ్లాక్‌లోని పరిశ్రమల కోసం 103 తాగునీటి కుళాయిల నిమిత్తం పారిశ్రామికవేత్తలు గతంలో జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులకు సుమారు రూ.14 లక్షలు చెల్లించారు. అయితే అధికారులు 53 కుళాయిలకు మాత్రమే కనెక్షన్లు ఇచ్చారు. అందులో 20 కుళాయిల ద్వారా మాత్రమే తూతూ మంత్రంగా తాగునీరు వస్తుంది. మిగతా 33 కుళాయిల నుంచి నీరు రావడం లేదని ఆయా పరిశ్రమల యాజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మొత్తం 103కు గాను 50 కుళాయిలకు ఇప్పటివరకు కనెక్షన్లు ఇవ్వకపోవడం దారుణమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన 50 కుళాయిలకు కనెక్షన్లు ఇవ్వాలని పలుమార్లు అధికారులను అడిగినా స్పందించడం లేదని వాపోతున్నారు. తక్షణమే వీటికి కనెక్షన్లు ఇవ్వడంతో పాటు అన్ని కుళాయిల నుంచి తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని పారిశ్రామికవేత్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు: ఎమ్మెల్యే గణబాబు



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న గణబాబు

మల్కాపురం, మార్చి 4: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు, పార్లమెంట్ నియోజకవర్గ నేత శ్రీ భరత్ అన్నారు. గ్రేటర్ 59వ వార్డు హిమాచల్‌నగర్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసీపీ రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ ఇద్దరి నేతలకు అడుగడుగునా మహిళలు హారతి పట్టారు. మసీద్, లక్ష్మీనగర్, ములగాడ, హౌసింగ్ కాలనీ, మాజీ సైనికుల కాలనీ, లేబర్ జంక్షన్‌లలో వారు పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అంగ దుర్గాప్రశాంతి, నాయకులు పీలా రామకృష్ణ, వార్డు మితిరెడ్డి శంకర్, రామ్మోహన్‌నాయుడు, పూడి భాస్కరరావు, ఉరుకోటి మహేశ్, ఆడారి రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలి

ఇంటక్ స్టీల్‌ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు



ప్లాంట్ పే సెక్షన్ వద్ద ధర్నా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఇంటక్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 4: ఉక్కు కర్మాగారం ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడంలో యాజమాన్యం విఫలమైందని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు పేర్కొన్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమ వారం ప్లాంట్ పే సెక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు చరిత్రలో ఎన్నడు లేని విధంగా జీతాలను కూడా సకాలంలో చెల్లించడం లేదని, ఇందుకు యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. ఇప్పటికే కార్మికులకు అన్ని ఆర్థిక ప్రయోజనాలకు కోత విధించిన ఉక్కు యాజమాన్యం జీతాల చెల్లింపులోనూ ఇబ్బందులకు గురి చేయడం భావ్యం కాదన్నారు. కార్మికుల సహనాన్ని పరీక్షించవద్దని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారు రమణ, బీఎస్ రాజు, వీవీ రమణమూర్తి, కొవిరి అవతారం, మంత్రి గోపినారాయణ, పైడి కొండలరావు, సుబ్బయ్య, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

వాసీవా ఆధ్వర్యంలో 6, 7 తేదీల్లో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఆటోనగర్, మార్చి 4: ఎంఎస్ఎంఈ, వాసీవా ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో-2024 నిర్వహిస్తున్నట్టు వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ పేర్కొన్నారు. ఆటోనగర్ విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) భవనంలో సోమవారం ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో-2024కు సంబంధించిన బ్రోచర్‌ను వాసీవా ప్రతినిధులు, ఎంఎస్ఎంఈ అధికారులు, పారిశ్రామికవేత్తలు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాండురంగప్రసాద్ మాట్లాడుతూ పలు పరిశ్రమలకు సంబంధించిన పారిశ్రామిక ఉత్పత్తులు, పలు ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు వంటి ఈ ఎక్స్‌పోలో కొలువు తీరుతాయన్నారు. వాసీవా ఉపాధ్యక్షుడు రాంప్రసాద్, కార్యదర్శి పరుచూరి ప్రభాకర్‌లు మాట్లాడుతూ ఈ ఎక్స్‌పోలో సుమారు 80 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఎంఎస్ఎంఈ ఏడీలు చంద్రమౌళి, శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఉత్సాహవంతులైన పారిశ్రామికవేత్తలకు, ఇంజనీరింగు విద్యార్థులకు ఈ ఎక్స్‌పో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఐలా మాజీ చైర్మన్ యార్లగడ్డ సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలు ఎక్స్‌పోలో పాల్గొంటాయని, ఎంఎస్ఎంఈ రాయితీల గురించి తెలుసుకునేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ ఎక్స్‌పో వేదికగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ప్రతినిధులు ప్రభాకర్, నాగిరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి కాపులు బుద్ధి చెబుతారు

జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

సిరిపురం, మార్చి 4: వచ్చే ఎన్నికల్లో కాపులు వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సోమవారం మేఘలయా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి కులం వారితో పవన్‌కల్యాణ్‌ను తిటిస్తున్నారన్నారు. ఇప్పుడు కాపు కమ్యూనిటీతో ఆ పని చేయిస్తున్నారని, కాపు జాతికి మీరేమి న్యాయం చేశారని ప్రశ్నించారు. నిజంగా కాపుల మీద ప్రేమ ఉంటే కాపు జాతిని తిట్టవచ్చా అని అడిగారు. పవన్‌కు సినిమాల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని ప్యాకేజీ తీసుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. హరిరామ జోగయ్య తనయుడు సూర్యప్రకాష్ ఏ ప్యాకేజీ కోసం వైసీపీలో చేరాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు చోడవరం నాయకుడు పీవీఎస్ఎన్ రాజు, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఉన్నారు.

ప్రమాద రహిత స్టీల్‌ప్లాంటే లక్ష్యం: సీఎండీ అతుల్‌భట్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎండీ అతుల్‌భట్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 4: ప్రమాద రహిత ఉక్కు కర్మాగారమే తమ లక్ష్యమని సీఎండీ అతుల్ భట్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎల్అండ్‌డీసీ సెంటర్‌లో సోమవారం 53వ జాతీయ భద్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. భద్రతా నియామావళిని పాటిస్తే ప్రమాదాలు జరగవని, తద్వారా ప్లాంట్ అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికను సద్వినియోగం చేసుకుని ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఫ్యాక్టరీస్ డైరెక్టర్ డీసీఎస్ వర్మ మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రత విషయంలో రాజీ పడకూడదని, భద్రతతోనే ప్లాంట్ ప్రగతిపథంలో పయనిస్తుందన్నారు. భద్రత విషయంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు డైరెక్టర్‌లు డీకే మహంతి, ఏకే బాగ్చి, పాండే, పలువురు ఉన్నతాధికారులు, కార్మిక సంఘ నాయకులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

షిప్‌యార్డులో భద్రతా దినోత్సవం

మల్కాపురం, మార్చి 4 : షిప్‌యార్డులో భద్రతా దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈసందర్భంగా సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రీ మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి భద్రతా నియమాలను పాటిస్తూ విధులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం: నలుగురు చిన్నారులకు గాయాలు



గాయపడిన చిన్నారులు

కూర్మన్నపాలెం, మార్చి 4: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో సోమవారం సాయంత్రం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి నలుగురు చిన్నారులను గాయపరిచింది. దీంతో ఆ తల్లిదండ్రులు లబోదిబోమంటూ తమ పిల్లలను కణితి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు ఇంజక్షన్లు వేసి తగిన జాగ్రత్తలను తీసుకోవాలని వారికి సూచించారు. ఈ వార్డులో కుక్కలు అధికంగా ఉన్నాయని, గుంపులు గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలంటూ పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారని వాపోతున్నారు. గత ఏడాది ఇదే వార్డులోని అంబేడ్కర్ కాలనీలో పొట్నూరు శాంతమ్మ (70) అనే వృద్ధురాలిని కుక్కలు దాడి చేసి చంపేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీకి ఏర్పాట్లు

వేపగుంట మార్చి 4: వేపగుంట జోనల్ కార్యాలయం పరిధి 89 నుంచి 98వ వార్డుల్లో టిడ్కో ఇళ్ల పట్టాల డాక్యుమెంట్స్ పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. సచివాలయాల వారీగా వేరుచేసి లబ్ధిదారులకు అందించేందుకు యూసీడీ అధికారులు చర్యలు చేపట్టారు. జోన్ పరిధిలో 9300 పట్టాల పంపిణీ చేయాల్సి ఉండగా దాదాపు 6000 ఇంటి ఒరిజనల్ డాక్యుమెంట్స్ వచ్చినట్టు ఏపీడీ శ్రీరామ్ తెలిపారు. సీఓలు దుర్గాప్రసాద్, వాసు, ఝాన్సీ, మురళీ కుమారి, జగదీశ్వరి, ఎమ్.కె. రత్నం తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

టీడీపీ-జనసేన విజయం తథ్యం

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మార్చి 4: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన పార్టీల విజయం తథ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సీఎం జగన్ ఓటమి భయంతో ఉన్నారని, ఆయనను ఓడించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ మేనిఫెస్టోను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తుందని విమర్శించారు. టీడీపీ-జనసేన కూటమి విజయాన్ని ఏ శక్తి అడ్డుకోలేదని పేర్కొన్నారు. అనంతరం పార్టీ ఇన్‌చార్జిలు, నాయకులకు సూపర్ సిక్స్ కిట్లను పంపిణీ చేశారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు బొండా జగన్, పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్ స్థలాన్ని పరిరక్షించాలి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధి కోనవానిపాలెం ఎంపీపీ పాఠశాల స్థలాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మండల రెవెన్యూ అధికారులపై ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. పాఠశాల స్థలం ఆక్రమణలకు గురవుతుందని, దీనిని పరిరక్షించాలని కోరుతూ కోనవానిపాలెం, వెంపల్లినగర్, దబ్లివానిపాలేనికి చెందిన ప్రజలు రెండు రోజులుగా పాఠశాల ఆవరణలో నిరసన దీక్ష చేస్తున్నారు. సోమవారం ఈ దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ స్కూల్‌కు 1990లో కేటాయించిన స్థలాన్ని ఇప్పుడు ఆక్రమించేందుకు పలువురు యత్నిస్తున్నందున తహసీల్దార్ తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 74వ వార్డు ఇన్‌చార్జి వియ్యపు కొండబాబు, నాయకులు గంగరాజు, దువ్వి శ్రీనివాస్, బి.బాలకృష్ణ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

యువత భవితే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర వృత్తి నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేశ్‌కుమార్

కొమ్మాది, మార్చి 4: సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యువత దేశంలోనే అత్యధికంగా మన రాష్ట్రంలో ఉన్నారని, వారికి ఉజ్వల భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం భవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర వృత్తి నైపుణ్యాభివృద్ధి, శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన పీఎంపాలెం వి.కన్వెన్షన్ హాల్లో ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈఓ డాక్టర్ వి. వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లలో రాష్ట్రంలోని యువతకు మెరుగైన శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే కార్యక్రమాలు ఎన్నో చేపట్టామన్నారు. మంగళవారం జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో పది కంపెనీలు ఎంఓయూలు చేసుకుంటాయని, భవిత కార్యక్రమానికి సంబంధించిన లోగో ఆవిష్కరణ ఉంటుందని వివరించారు.

స్పేస్ సెంటర్‌ను సందర్శించిన విజ్ఞాన్ విద్యార్థులు



స్పేస్ సెంటర్ ఆవరణలో విద్యార్థులు

అగనంపూడి, మార్చి 4: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా సోమవారం శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని షార్ లైబ్రరీ, లాంచ్ ప్యాడ్, స్టాటిక్ టెస్ట్, స్పేస్ మ్యూజియం, మిషన్ కంట్రోల్, లాంచ్ కంట్రోల్ విభాగాలను ఆసక్తిగా తిలకించారు. ఆయా విభాగాల పనితీరు గురించి స్పేస్ సెంటర్ టెక్నికల్ ఇంజనీర్ రామానుజులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చైతన్య, అప్పలరాజు, చరిష్మా, తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్‌కు ఘన నివాళి

గోపాలపట్నం, మార్చి 4: ఇటీవల మృతి చెందిన సీనియర్ విశ్రాంత ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్‌కు గ్రేటర్ పరిధి 92వ వార్డు జనతా కాలనీ మహిళా సంఘ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. జనతాకాలనీలోని సోమవారం ఏర్పాటు చేసిన సంతాపసభతో సంఘ అధ్యక్షురాలు మొజ్జాడ విమల మాట్లాడుతూ జన్నత్ హుస్సేన్ విశాఖ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన సమయంలో పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు ఆయన చేసిన కృషి చేశారన్నారు. దీంతో జన్నత్ హుస్సేన్ పేరుమీద జనతా కాలనీ ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. ఈసందర్భంగా కాలనీ మహిళా సంఘ సభ్యులు జన్నత్ హుస్సేన్ సేవలు స్మరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కె.కె.లక్ష్మి, బి.వెంకటలక్ష్మి, శివ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్జనే ధ్యేయంగా జీవీఎంసీ పాలకవర్గం

ప్రజల అవసరాల కంటే జేబులు నింపే పనులకే ప్రాధాన్యం

టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పాలకవర్గంలోని వైసీపీ పెద్దలు అక్రమార్జనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు ఆరోపించారు. సోమవారం జీవీఎంసీలోని తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు అవసరమైన పనులతో పాటు మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ తమకు జేబులు నింపే పనులకే నిధులు కేటాయిస్తున్నారన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఇలాంటి పనులకు ప్రతిపాదనలు పెడితే తాము అడ్డుకుంటామన్న భయంతో స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించేసుకుంటున్నారన్నారు. రూ. 50 లక్షలు లోపు పనులను మాత్రమే స్టాండింగ్ కమిటీలో పెట్టాల్సి ఉండగా, రూ. రెండు కోట్ల విలువైన పనులను కూడా ముక్కలుగా చేసి స్టాండింగ్ కమిటీలో పెట్టి ఆమోదింపజేసుకుంటున్నారన్నారు. కొన్ని పనులకు కనీసం పరిపాలనా ఆమోదం లభించకపోయినాసరే పనులను పూర్తి చేస్తుండడం పాలకవర్గం అవినీతికి అద్దంపడుతోందన్నారు. దీనిపై అభ్యంతరం తెలపాల్సిన కమిషనర్ కూడా పాలకవర్గం అవినీతికి అండగా నిలుస్తున్నారని విమర్శించారు.

డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ పాతజైలురోడ్డులోని ఫుడ్‌కోర్ట్‌ను తొలగించాలని కౌన్సిల్‌లో తీర్మానం చేసి పది నెలలు గడుస్తున్నా ఇంతవరకూ తొలగించలేదన్నారు. తక్షణమే ఫుడ్‌కోర్ట్‌ని అక్కడి నుంచి తొలగించాలని లేకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. 67వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక హౌస్ కమిటీలోని స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు ప్లాన్ లేదనే సాకుతో వందశాతం ఎక్కువ ఆస్తిపన్ను విధిస్తున్నారని, తాజాగా ఆయా ఇళ్లస్థలాలకు ప్రభుత్వం పట్టాలు జారీచేసినందున ఆస్తిపన్ను తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ కార్పొరేటర్లు బొండా జగన్నాథం, రౌతుశ్రీనివాసరావు, పీవీ నరసింహం పాల్గొన్నారు.

పౌరులు మానసిక ఆరోగ్యంపై దేశాభివృద్ధి

మల్కాపురం, మార్చి 4 : పౌరులమానసిక ఆరోగ్యంపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందని ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ రాష్ట్ర సైకాలజిస్ట్ మంత్రి సాయి వంశీ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మన ఆలోచనలు , భావాలు , ప్రవర్తన , భావోద్రేకాలు, మానసిక బలం తెలుసుకుని సమర్థతో పని, అందరితో సఖ్యతగా ఉండగలిగినప్పుడు మానసిక ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. విద్యార్థి దశలో మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమన్నారు. వారు ఒత్తిడిలేకుండా ఉండాలన్నారు. ఎన్ఎస్ఎ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపీఎస్ భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయదేవి మాట్లాడారు. అనంతరం వంశీని ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు, విద్యార్థినుల పాల్గొన్నారు.

ఘనంగా విద్యుత్ లైన్‌మెన్ దివస్


మాట్లాడుతున్న సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సీతమ్మధార, మార్చి 4: సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ వారి నేతృత్వంలో టాటా పవర్ ఢిల్లీ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ సోమవారం ఢిల్లీలో సేవా సురక్ష స్వాభిమాన్ పేరుతో దేశవ్యాప్తంగా లైన్‌మేన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో విశాఖపట్నం సర్కిల్ కార్యాలయం నుంచి సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్ ఇమ్మడి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ నుంచి ఉత్తమ అవార్డులు తీసు కున్న లైన్‌మేన్లుచొడ్డెం రాధాకృష్ణ (బట్టాయగూడెం), మీసాల రామస్వామి (ఆమదాలవలస), టేకి కొండాచారి (సంపత్‌నగరం)లకు ఆయన అభినందనలు తెలిపారు. లైన్‌మేన్ల సేవలను ప్రశంసించారు. భద్రత నియమాలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. సర్కిల్ పరిధిలోని వినియోగదారులకు విశేష సేవలందించిన 17 మందికి ఉత్తమ లైన్‌మేన్ అవార్డులనుఅందజేశారు. కార్యక్రమం లో డైరెక్టర్ ఆపరేషన్స్ పి.శ్రీనివాసమూర్తి, ఎస్ఈ ఎల్.మహేంద్ర నాథ్ పాల్గొన్నారు.


ఢిల్లీలో అవార్డు తీసుకున్న లైన్‌మేన్లు

మహిళలు మరింత విజయపథంలో పయనించాలి

» రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కిరణ్ బేడీ


జ్యోతి వెలిగిస్తున్న కిరణ్‌బేడీ

మహారాణిపేట, మార్చి 4: మహిళలు తమ శక్తి, పనిసామర్థ్యాలను మరింతగా మెరు గుపరుచుకుని విజయ పథంలో పయనించాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ అన్నారు. హోటల్ నోవాటెల్‌లో లుక్ ఆఫ్ ట్రెండ్ అడ్వర్‌టైజింగ్ అండ్ మార్కెటింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంతో మంది మహిళలు విభిన్న రంగాలలో అద్భుతమైన విజయాలు సాధించారన్నారు. గతంలో స్త్రీ, పురుషుల వేతనాల మధ్య వ్యత్యాసం ఉండేదని, ఇప్పుడు ఆ తేడాలేకుండా అందరినీ సమానంగా చూస్తున్నారు. కార్యక్రమంలో ఐఎన్ఎస్‌వీ తార, పాతరవల్లి స్వాతి, డాక్టర్ మేడపాటి వినీల పాల్గొన్నారు

1500 మంది ఓటర్లు దాటితే అనుబంధ పోలింగ్ కేంద్రం

» కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, మార్చి 4: ఓటర్ల సంఖ్య 1500 దాటితే ఆ ప్రాంతంలో పోలింగ్ కేంద్రానికి అనుబంధంగా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ఏ మల్లికార్జున అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని స్పష్టంచేశారు.ఎన్నికల జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందించినట్టు, రాజకీయ పార్టీలు, ప్రజల సహకారంతో ఎన్నికల ప్రక్రియను సమర్థంగా నిర్వహిస్తామని అన్నారు. రాజకీయ పార్టీలు సూచనలు, సలహాలను కోరారు. నియోజకవర్గం స్థాయి సమావేశాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. జిల్లాలో 1941 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల ఐసీయూ వార్డును సిద్ధం చేయాలి

మహారాణిపేట, మార్చి 4: కేజీహెచ్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ ఏ మల్లికార్జున సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల వార్డులో ఆధునికీకరిస్తున్న ఐసీయూ వార్డును పరిశీలించారు. పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆ యూనిట్‌లో కల్పిస్తున్న మౌలిక వసతులు , సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక సౌకర్యాలతో చిన్న పిల్లల వార్డు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు ఈసందర్భంగా తెలిపారు. ఆస్పత్రి ఓపీ గేటు వద్ద ఆర్చ్ నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డా బుచ్చిరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.


కేజీహెచ్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

'జగనన్నకు చెబుదాం'కు 226 అర్జీలు

మహారాణిపేట, మార్చి 4: అర్జీదారుల సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కే మయూరి అశోక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వారినుంచి 226 వినతులను స్వీకరించారు. అందులో రెవెన్యూ విభాగానికి చెందినవి 72, జీవీఎంసీకి 60, పోలీసుశాఖకు చెందినవి 16 ఇతర విభాగాలకు చెందినవి 78 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె మోహన్‌కుమార్ , రెవెన్యూ , పోలీసు, జీవీఎంసీ ఇతర అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న జేసీ, అధికారులు

దాడికి యత్నించిన రౌడీ షీటర్ అరెస్టు

సీతంపేట, మార్చి 4: మద్యం తాగి కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించడంతోపాటు, మరోవ్యక్తిపై దాడికి ప్రయత్నించిన రౌడీషీటర్‌ను నాలుగోపట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి ప్రాంతానికి చెందిన పొలిమేర రాఘవేంద్ర స్వామి, శ్రీనివాసరావు, అలియాస్ దుబాయ్ శ్రీను చిన్ననాటి స్నేహితులు. వీరిద్దరికి ఆర్థిక లావాదేవిలు ఉన్నాయి. రాఘవేంద్ర స్వామి తన అవసరమై కొంత డబ్బు దుబాయ్ శ్రీను వద్ద వాడుకున్నాడు. అయితే, ఆర్థిక పరిస్థితి బాగాలేక డబ్బు ఇవ్వలేకపోయాడు. అడిగితే పలుమార్లు తిప్పాడు. దీంతో ఈ నెల 3వ తేదీన దుబాయ్ శ్రీను.. మద్యం తాగుదామని రాఘవేంద్రస్వామిని పిలిచాడు. ఈ క్రమంలో డబ్బు ప్రస్తావనవచ్చింది. ఉన్నప్పుడు ఇస్తానని చెప్పడంతో దుబాయ్ శ్రీను బూతులు తిడుతూ బీరు సీసాతో రాఘవేంద్ర స్వామిపై దాడికి ప్రయత్నించాడు. బార్‌లో వీరిద్దరూ గలాటా చేశారు. అనంతరం అక్కడి నుంచి తప్పించుకున్న రాఘవేంద్ర స్వామి నాలుగో పట్టణ పోలీసులకు సోమవారం దుబాయ్ శ్రీనుపై ఫిర్యాదు చేశాడు. సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు. స్టేషన్ ఎస్ఐ మీసాల సూర్యారావు దర్యాప్తు చేపట్టి శ్రీనుపై 307, 233, 234, 506 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా, ఆదివారం మద్యం తాగి అక్కయ్యపాలెం రోడ్డు పైనున్న బార్ వద్ద దుబాయ్ శ్రీను మద్యం తాగి అండర్‌వేర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోలీసులు అతనిని అడ్డుకొని ప్రశ్నించారు. దీంతో విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దుబాయ్ శ్రీను తిరగబడి విధులను ఆటంకం పరిచాడు. పోలీసులు శ్రీనుపై ఈ కేసు నమోదు చేశారు.

వన్నె తగ్గని ఘంటసాల గాన మాధుర్యం

» ప్రముఖ సినీనటుడు సుమన్


ఎన్ఆర్ఐ జి.దాముకు ఘంటసాల స్మారక పురస్కారం ఇస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, మార్చి 4: సినీ రంగానికి ఘంటసాల అందించిన సేవలు మరపురానివని ప్రముఖ సినీనటుడు సుమన్ కొనియాడారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల గ్లోబల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ టి. శరత్‌చంద్ర ఐడియల్ గాంధర్వ లోగో ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుమన్ ఎన్ఆర్ఐ జి.దాముతో కలిసి జ్యోతి ప్రజల్వన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఘంటసాల తన గాత్రమాధుర్యంతో జనాల మనస్సుల్లో నిలిచిపోయారన్నారు.ఆయనను తరతరాలు గుర్తుంచుకుంటున్నారు. తెలుగు సినీ చరిత్రలో ఆయన ఎందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఆయన మనమధ్యన లేకపోయిన ఆయన గాత్రం నిరంతరం ఉంటూనే ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయి స్వరపోషకులు జి.దాముకు జీవిత సాఫల్య పురస్కారం సుమన్ చేతులమీదుగా అందజేశారు. శివారెడ్డి మిమిక్రీ అలరించింది. కార్యక్రమంలో ఘంటసాల స్మారకపీఠం స్వరపోషకులు ఎంఎస్ రాజు, వంకాయల సన్యాసిరాజు కె.సుధారాణి, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.డాక్టర్ టి.శరత్‌చంద్ర సంగీత సారథ్యంలో ఘంటసాల ఆలపించిన చిత్రాల్లో గీతాలను ఆలపించారు.

ఎరుకుమాంబ ఆలయంలో శివరాత్రికి ఏర్పాట్లపై సమీక్ష


సమావేశంలో పాల్గొన అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు

సీతంపేట, మార్చి 4: దొండపర్తిలో ఎరుకుమాంబ దేవస్థానంలో ఈ నెల 8తేదీన మహాశివరాత్రి వేడుకలను నిర్వహణకు విస్తృత ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం ఆలయంలో వివిధ విభాగాల అధికారులతో సీతమ్మధార డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌ఏ త్రినాదరావుఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారి దర్శనానికి వీలుగా తగిన క్యూలైన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తాగునీరు, మజ్జిగ సరఫరా, మహాశివరాత్రి రోజున భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, శాంతి భద్రతలు, పారిశుధ్య పనుల కల్పనపై చర్చించారు. సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జీవీ రమాభాయి, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌ఏ తిన్నాధరావు, నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ ఐ.గంగాధర్, ఫైర్ స్టేషన్ హెచ్‌సీ సి.గోవిందరావు, కానిస్టేబుల్ రవికుమార్, జీవీఎంసీ ఏఎంహెచ్ ఓ సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎంఎస్ దొర, వీఆర్ఓ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

మాధవధార, మార్చి 4 ; గ్రేటర్ 51వవార్డులో సోమవారం వైసీపీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.రమణికుమారి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్, ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి, గాజువాక ఎమ్మెల్యే టి.నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నగర అధ్యక్షులు కె.గురువులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, కార్పొరేటరు ఆర్. వెంకటరమణ తదితరులు హాజరయ్యారు. బొత్స ఝాన్సీతోపాటు ఇతర మహిళా నేతలు, అతిథులను సన్మానించి మెమెంటోలు అందించారు. ఈ సమావేశ వేదిక మాధవధార ఉడాకాలనీ సమీపాన మెయిన్ రోడ్డుపై ఎంపిక చేయడంతో జనాలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం స్కూలు బస్సులు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు, బైక్‌లు నిలిచిపోయాయి.


మేయరుకి, బొత్స ఝాన్సీకి మెమెంటో అందిస్తున్న వరుదు కల్యాణి, రమణి కుమారి

ఫొటోగ్రాఫర్ హత్య కేసులో నిందితులకు రిమాండ్

కొమ్మాది, మార్చి 4 : మధురవాడలోని బక్కన్నపాలెంనకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయి పవన్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్టు పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ సీఐ వై. రామకృష్ణ తెలిపారు. సాయి పవన్ హత్య కేసులో నిందితులు షణ్ముఖ తేజ, కారు డ్రైవర్ వినోద్‌ను పీఎం పాలెం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు వారిని అదుపులోకి విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారు.

పోలీసు కమిషనరేట్ స్పందనలో 72 ఫిర్యాదులు

మహారాణిపేట, మార్చి 4: పోలీసు కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 72 ఫిర్యాదులు వచ్చాయి. అధికారులు ఫిర్యాదుదారులనుంచి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరంగా పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో డీసీపీలు వీఎన్ మణికంఠ చందోల్, ఎం సత్తిబాబు,పల్లా వెంకటరత్నం, ఎంఆర్‌కె రాజు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన ఎన్‌సీఆర్‌టీ బృందం

జగదాంబ కూడలి, మార్చి4: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ ట్రైనింగ్ సంస్థకుచెందిన న్యూఢిల్లీ (ఎన్‌సీఆర్‌టీ) ప్రతినిధుల బృందం సోమవారం పూర్ణామార్కెట్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీలు, పాఠశాలలో విద్యార్థులకు సంబంధించి వసతులు, విద్యా ప్రమాణాలపై ఎన్‌సీఆర్‌టీ హెడ్ ప్రొఫెసర్ వి.పి. సింగ్ ఆధ్వర్యంలో ఆరా తీశారు. ఇక్కడ నిర్వహిస్తున్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, వసతులపై జీవీఎంసీ ఏపీడీవో, కార్యకర్తలతో మాట్లాడారు. పాఠశాల హెచ్‌ఎం రవికుమార్ పిల్లలకు అందిస్తున్న బోధనతదితర అంశాలు వివరించారు. హెడ్ ప్రొఫెసర్ వి.పి సింగ్ అంగన్‌వాడీలకు వంట గదులు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.డైట్ ప్రిన్సిపాల్, టీచర్లు, ట్రైనీ విద్యార్థులు పాల్గొన్నారు.


పూర్ణామార్కెట్ వద్ద పాఠశాలలో ఎన్‌సీఆర్‌టీ హెడ్ ప్రొఫెసర్ వి.పి. సింగ్

పదోన్నతుల్లో న్యాయం చేయాలని నిరసన

విశాఖపట్నం, మార్చి 4: పదోన్నతుల్లో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ఇంజనీర్స్ అసోసియేషన్ సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నగరంలోని చీఫ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పదోన్నతుల్లో అన్యాయం జరిగిందని, ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గరుగుబెల్లి రామచంద్రరావు మాట్లాడుతూ ఇంజనీర్ల పదోన్నతుల విషయంలో వివిధ రూపాల్లో పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసనలు ప్రదర్శిస్తామని, 7న విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని చెప్పారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేవీఎన్ స్వర్ణకుమార్, డీఈఈ, ఏఈఈ, ఈఈలు పాల్గొన్నారు.

టెట్, టీఆర్‌టీకి మధ్య వ్యవధిపై తీర్పు.. జేఏసీ హర్షం

అక్కయ్యపాలెం, మార్చి 4: టెట్‌కు టీఆర్టీకి మధ్య వ్యవధి ఉండాలని హైకోర్టు తీర్పు నివ్వడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పరీక్షలకు మధ్య నెల రోజులు చదువుకునేందుకు వీలుగా సమయం కావాలని రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ ఓదార్పు యాత్ర ద్వారా అభిప్రాయ సేకరణ చేసి నివేదికను మీడియా ద్వారా సమర్పించామన్నారు. దీనికి స్పందించి హైకోర్టు నిరుద్యోగుల సమస్యను అర్థం చేసుకు నెల రోజులు ఈపరీక్షల మధ్య వ్యవధి ఉండాలని తీర్పు నిచ్చినట్టు చెప్పారు.

జనసేన ప్రచారం

జగదాంబ కూడలి, మార్చి 4: దక్షిణ నియోజవర్గంలో జనసేన పార్టీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది.ఆపార్టీ నాయకుడు, కార్పొరేటర్ కందుల నాగరాజు సోమవారంమెయిన్ రోడ్డు ఆంజనేయస్వామిగుడి నుంచి పూర్ణామార్కెట్ వరకు రోడ్డు పక్కన ఎండలో వ్యాపారాలు సాగిస్తున్న వారికి పార్టీ గుర్తుతో ఉన్న పెద్ద వ్యాపార గొడుగులను అందజేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రామికనగర్‌లో సులాభ్ కాంప్లెక్స్ ప్రారంభం

అక్కయ్యపాలెం, మార్చి 4 : గ్రేటర్ 44వ వార్డు శ్రామికనగర్‌లో రూ.14 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సులాభ్ కాంప్లెక్స్‌ను సోమవారం జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత స్థానికులు చాలా ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని దీన్ని నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ రమణమ్మ, కన్వీనర్లు ఆదినారాయణ, పిగోపి పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్ పేరుతో ఘరానా మోసం

» రూ.64 లక్షల మోసపోయిన నగరవాసి
» సైబర్ పోలీసుల అదుపులో నిందితులు

ఎండాడ, మార్చి 4: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయంటూ నమ్మించి కొంతమంది మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్ నంబర్‌ను గ్రూపుల్లో చేర్చి, లింక్‌లు పంపించి వాటి ద్వారా ముగ్గులోకి దింపుతున్నారు. నగరానికి చెందిన వ్యక్తి అటువంటి మోసానికే గురయ్యారు. విశాలాక్షినగర్‌కి చెందిన ఒక వ్యక్తికి వాట్సాప్ గ్రూపులో ఇన్విటేషన్ లింక్ వచ్చింది. దాని పేరు స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా ఉంది. అందులో సంబంధిత వ్యక్తి చేరగా...అజీమ్‌సింగ్ అనే వ్యక్తి స్టాక్స్ కొనుగోలు, అమ్మకానికి సంబంధించి ఉపన్యాసాలు ఇచ్చేవాడు. అతను...జోక్సా ప్లాట్‌ఫామ్‌లో ఫారిన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్‌గా ట్రేడర్ సీటు తీసుకోవాలని బాధితునికి సూచించాడు. అది తీసుకుంటే మార్కెట్‌లో అధిక రాబడి వస్తుందని నమ్మబలికాడు. అతని మాటలు విని దఫదఫాలుగా రూ.64 లక్షల వరకూ డిపాజిట్ చేసి మోసపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన సైబర్ క్రైమ్ పోలీసులు అతడు డిపాజిట్ చేసిన కొంత నగదు నగరానికి చెందిన ఒక వ్యక్తి ఖాతాలోకి వెళ్లినట్టు గుర్తించారు. ఆయన ఖాతా నుంచి హైదరాబాద్‌లోని మరికొన్ని అకౌంట్స్‌లోకి వెళ్లినట్టు గుర్తించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన చివికుల వెంకట అనిల్, అనుగూరు మనోహర్, తాళ్లబత్తుల సతీష్ కుమార్, ఒడిశాకు చెందిన శరత్ చంద్ర బెహరా, విశాఖకు చెందిన యడ్ల నాగేశ్వరరావులను అదుపులోకి తీసుకున్నారు. వారంతా యూఎస్‌డీటీ క్రిప్టో ట్రేడింగ్ చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.

ప్లీజ్... తప్పకుండా రండి!

... 3వ పేజీ తరువాయి

నోవాటెల్‌లో సమావేశపరిచి సీఎం సమావేశానికి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. అలాగే ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) వంటి సంస్థల నుంచి సభ్యులు అంతా హాజరు కావాలని కోరారు. ఇది కాకుండా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రతి పారిశ్రామికవేత్తకు ఫోన్ చేసి సీఎం సమావేశానికి రావాలని కోరుతున్నారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకూ జరిగే ఈ కార్యక్రమానికి ఉదయం 10 గంటలకే హాజరు కావాలని, దీనికి పాస్‌లు కూడా ఇస్తున్నామని చెబుతున్నారు. వస్తున్నారా?, లేదా?...అంటూ కన్‌ఫర్మేషన్ కూడా తీసుకుంటున్నారు. ఇలా ఒక్కో పారిశ్రామికవేత్తకు మూడేసిసార్లు ఫోన్లు చేస్తున్నారు. మరోవైపు ఏపీఐఐసీకి చెందిన అధికారులు కూడా వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెడుతున్నారు. సమావేశాన్ని విజయవంతం చేసే బాధ్యతను అధికారుల భుజాలపై వేశారు. పార్టీ నాయకులు పిలిస్తే వచ్చే పరిస్థితి లేకపోవడం వల్లే అధికారులపై ఆధారపడ్డారు. ఐటీ, టూరిజం, లాజిస్టిక్స్, ఆక్వా, సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ ఆస్పత్రులు, రియల్ ఎస్టేట్...ఇలా అన్ని రంగాలకు చెందిన వారిని ఈ సమావేశానికి తీసుకురావాలని, అక్కడి 'సాగరిక' సమావేశ మందిరాన్ని కిటకిటలాడేలా చేయాలని యత్నిస్తున్నారు. సమావేశాన్ని రక్తి కట్టించడానికి వైసీపీ భక్తుల్లో ముగ్గురికి ప్రశ్నలు అడిగే అవకాశం కల్పించారు. ఏమి అడగాలో వారికి ముందే సూచించారు. వాటికి సమాధానాలు కూడా ముందే సిద్ధం చేసుకున్నారు. సీఎం సమావేశం నేపథ్యంలో తమను ఉద్యోగాలకు, కాలేజీలకు వెళ్లనిస్తారా?, లేదా?...అని రుషికొండ మార్గంలో రెగ్యులర్‌గా వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు.

కొండకు ఎసరు

... 3వ పేజీ తరువాయి

కనుసన్నల్లోనే జరగడంతో అధికారులు నోరు మెదపలేకపోతున్నారు. ఈ విషయమై స్థానిక వీఆర్‌ఓను వివరణ కోరగా, ఫిర్యాదు అందిన వెంటనే వెళ్లి పనులు ఆపించానని చెప్పారు. గత తహసీల్దార్‌కు, ప్రస్తుత తహసీల్దార్‌కు ఇవన్నీ తెలుసునని గ్రామస్థులు చెబుతున్నారు.

గాజువాక వైసీపీలో కుమ్ములాట

... 3వ పేజీ తరువాయి

కార్పొరేటర్లు బీఎస్ పాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు హాజరయ్యారు. ఎమ్మెల్యే నాగిరెడ్డికి వ్యతిరేకంగా సమావేశంలో కొందరు మాట్లాడినట్టు వార్తలు వచ్చాయి. దీంతో నియోజకవర్గంలో నేతలు రెండు వర్గాలుగా చీలిపోయారని స్పష్టమైంది. ఎన్నికలకు ఇంకా నెల రోజులు మాత్రమే వ్యవధి ఉన్న తరుణంలో నేతలు ఎవరి దారి వారిదే అన్నట్టు వ్యవహరిస్తుండడంతో పార్టీ గెలుపు కష్టమేనని కార్యకర్తలే అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుండగా ఎమ్మెల్యే నాగిరెడ్డి తీరుపై సమన్వయకర్త చందుతోపాటు కొంతమంది కార్పొరేటర్లు సోమవారం ఎండాడలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీనిపై ఆయన స్పందిస్తూ మంగళవారం నగరానికి సీఎం జగన్ వస్తున్నందున గాజువాక సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిసింది.

అడ్డగోలు ఎజెండా

... 3వ పేజీ తరువాయి

పార్కు అభివృద్ధి కోసం సుమారు రూ.రెండు కోట్లు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు తయారుచేశారు. దీనిని కూడా నాలుగు ముక్కలుగా విభజించి ఎజెండాలో చేర్చారు. ఇంకా గత ఏడాది వినాయక చవితి సందర్భంగా నిమజ్జనం కోసం ఎనిమిది, తొమ్మిది వార్డుల పరిధిలోని ఐటీ సెజ్, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం బీచ్‌లో లైటింగ్ ఏర్పాటుకోసం రూ.ఏడు లక్షలు ఖర్చు చేసినందున ఆ బిల్లు చెల్లింపునకు స్టాండింగ్ కమిటీ ఆమోదం కోసం ఇప్పుడు ప్రతిపాదించారు. ఆరు నెలల తర్వాత బిల్లు పెట్టడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటితోపాటు ఉద్యోగుల సర్వీసుకి సంబంధించిన అంశాలు, దుకాణాల వేలం, తదితర అంశాలను ఎజెండాలో చేర్చారు.

విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయమే లక్ష్యం

» నేటి విజన్ విశాఖ సదస్సుకు 2,000 మంది పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు
» పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాగర్‌నగర్ (విశాఖపట్నం), మార్చి 4: విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయడమే తమప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సాగర్‌నగర్ సమీపంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో మంగళవారం 'విజన్ విశాఖ' పేరుతో నిర్వహించనున్న సదస్సుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'విజన్ విశాఖ' సదస్సుకు దాదాపు రెండు వేల మంది పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు హాజరుకానున్నారన్నారు. ఈ సందర్భంగా విశాఖపై తన విజన్‌ను రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి తెలియజేస్తారన్నారు. అన్ని రంగాల్లో విశాఖను అభివృద్ధి చేయాలనేది ఆయన లక్ష్యమన్నారు. అలాగే జీవీఎంసీ పరిధిలో రూ.1,500 కోట్లతో చేపట్టనున్న పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారన్నారు. ముడసర్లోవలో జీవీఎంసీకి నూతన భవన నిర్మాణం, కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నగరానికి నీటి సరఫరా, సాగర్‌నగర్ బీచ్ రూ.10 కోట్లతో అభివృద్ధి, వెంకోజీపాలెం నుంచి మేరియట్ హోటల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం వంటి పనులకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు కూడా వెల్లడించనున్నారన్నారు. ఎన్నికల ముందు విజన్ గుర్తువచ్చిందా అని ఓ విలేఖరి అడిగిన ప్రశ్నకు...తమ ప్రభుత్వానికి ముందు నుంచి విజన్ వుందని మంత్రి సమాధానం ఇచ్చారు. ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు ఏర్పాటుకు సిద్ధమవుతోందని, అందుకు ప్రభుత్వం నుంచి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఐటీకి సంబంధించి ఇప్పటికే అనేక కంపెనీలు విశాఖ వచ్చాయన్నారు. అనకాపల్లిలో ఈ నెల ఏడో తేదీన 'వైఎస్ఆర్ చేయూత' కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నట్టు మంత్రి చెప్పారు.

ఏసీబీ వలలో వీఆర్వో

» వీఆర్‌ఏ కూడా.. » రైతు నుంచి లంచం తీసుకుంటూ చిక్కిన వైనం

నాతవరం, మార్చి 4: నాతవరం తహసీల్దార్ కార్యాలయంలో ఓ రైతు నుంచి లంచం తీసుకుంటున్న వీఆర్వో, వీఆర్‌ఏలను ఏసీబీ అధికారులు సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ రమ్య తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నాతవరం మండలం గుమ్మిడిగొండ గ్రామానికి చెందిన అడిగర్ల వంశీకృష్ణ అనే రైతు తన తండ్రి పేరున ఉన్న రెండు ఎకరాల 16 సెంట్ల భూమికి సంబంధించి మ్యూటేషన్, అడంగల్ కరెక్షన్‌కు గుమ్మిడిగొండ గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్వో) జుర్రా సింహాచలం, గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ) చేవళ్ల లోవరాజును సంప్రతించాడు. దీంతో రూ.8 వేలు లంచం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై ఆ రైతు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు ఆ రైతు సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. వీఆర్వో సింహాచలానికి రూ.6 వేలు, వీఆర్‌ఏ లోవరాజుకు రూ.2 వేలు ఇచ్చాడు. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రాత్రి వరకు తహసీల్దార్ కార్యాలయంలోనే విచారణ జరిపారు. వీఆర్వో, వీఆర్‌ఏలను మంగళవారం విశాఖలోని ఏసీబీ కోర్టుకు తరలించనున్నట్టు అధికారులు తెలిపారు.


ఏసీబీకి పట్టుబడిన గుమ్మిడిగొండ వీఆర్వో సింహాచలం, వీఆర్‌ఏ లోవరాజు

నౌకల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై పోర్టు ఒప్పందం

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు నౌకల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం ఎన్‌టీసీపీడబ్ల్యుసీ సంస్థతో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆధునిక సరకు రవాణాలో నౌకల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అత్యంత కీలకమైన అంశం కావడంతో ఈ ఒప్పందం చేసుకున్నట్టు పోర్టు చైర్మన్ అంగముత్తు వెల్లడించారు. ఎన్‌టీసీపీడబ్ల్యుసీ సంస్థ తరఫున ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కుమార్‌రాజు సంతకం చేశారు. ఈ ఒప్పందం విలువ రూ.14.03 కోట్లు కాగా పదేళ్లు ఆ సంస్థ తరఫున సేవలు అందుతాయి. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దుబే, డిప్యూటీ కన్జర్వేటర్ కెప్టెన్ శ్రీనివాస్, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

జ్ఞానాపురం, మార్చి 4: గ్రేటర్ 41వవార్డులో సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ తెలిపారు.సోమవారం సుబ్బలక్ష్మీనగర్, బాబూకాలనీ, వెంకటరాజు నగర్ ల్లో పర్యటించి రోడ్లు, డ్రైన్లను పరిశీలించారు. డ్రైన్ల వద్ద మురుగునీరు నిల్వ ఉండిపోతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు వెంటనే ఇంజనీరింగ్ సిబ్బందికి తెలయజేసి సమస్య పరిష్కరించారు. వైసీపీనేత శ్రీధర్, డీఈ భరణి, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ప్రభు,వైభవ్ ఉన్నారు.



స్వామివారికి తులసీ దళార్చన

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, మార్చి 4 : వరాహలక్ష్మీనృసింహస్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములతో షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చన జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత గోవిందరాజాస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి, అర్చకులు అష్టోత్తర శతనామార్చన చేయగా భక్తులు స్వామి చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేశారు.అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో స్వామివారి కల్యాణ క్రతువు నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

స్పందనకు నాలుగు వినతులు

భీమునిపట్నం, మార్చి 4 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. జోనల్ కమిషనరు కనక మహాలక్ష్మి వినతులు స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి 3, ఇంజనీరింగ్ విభాగానికి 1 అర్జీ అందింది. పిర్యాదులను ఆయా విభాగాలకు పంపించి వారం రోజుల్లో పరిష్కరించాలని జడ్సీ ఆదేశించారు.

ప్రమాదకర బోర్డు తొలగింపు

ఎంవీపీ కాలనీ, మార్చి 4 : గిరిజన్ భవన్ కూడలి వద్ద ప్రమాదకరంగా ఉన్న బోర్డును జీవీఎంసీ అధికా రులు సోమవారం తొలగిం చారు. ఇక్కడ ఓ ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేసిన బోర్డు ప్రమాదకరంగా ఉండడంతో 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల కథ నం వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు ఆ బోర్డును తొలగించారు.

ఘనంగా వాకర్స్ క్లబ్ వార్షికోత్సవం

ఎంవీపీ కాలనీ, మార్చి 4 : నగరంలోని శివాజీ పార్కులో గొడుగు వాకర్స్ క్లబ్ ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా అక్షయ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.వంద మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు శుభ, ద్వారకానాథ్, నందూరి రామకృష్ణ, టి. ప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

పెదవాల్తేరు, మార్చి 4 : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేటకు చెందిన పిల్లా గంగులోడు (48) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వైసీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సోమవారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేసి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైసీపీ 19వ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకట లక్ష్మి దాసు, వార్డు అధ్యక్షుడు వాడమొదుల గణేష్, పిల్లా పరదేశి, మహిళా అధ్యక్షురాలు బెహ్రా వసంత పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

పద్మనాభం, మార్చి 4 : పద్మనాభంలో ఎన్టీఆర్ ట్రస్టు, ఎంవీఎస్ మూర్తి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గీతం వైద్యులు 300 మందికి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు పావని, నాయకులు ఎర్నాయుడు, సన్యాసిరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి,
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 15, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 32, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 20, క్యారేట్ 24, దొండకాయలు 28, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 110, బరబటి 20, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 160, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 24 , కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	117
ఫారం ధర	--	137
విత్ స్కిన్	--	244
స్కిన్‌లెస్	--	254

దారి మూసివేత

- పాత గోశాల, పాత అడివివరం మధ్య గోడ నిర్మాణం
- బీఆర్‌టీఎస్‌లో పనుల్లో కట్టిన అధికారులు
- రాకపోకలకు స్థానికుల అవస్థలు

సింహాచలం, మార్చి 4 : జీవీఎంసీ 98వ వార్డు పాతగోశాల కూడలి నుంచి పాతఅడివివరం కూడలి వరకు ఉన్న 2 కిలోమీటర్ల బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణం స్థానికులకు శాపంగా మారింది. గోశాల నుంచి సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ మధ్య ప్రధాన రహదారిని కలుపుతూ ఆయిల్ మిల్ పక్క నుంచి గ్రామీణ ఆరోగ్య కేంద్ర పక్క నుంచి రెండు మార్గాలు ఉండేవి. వాటి ద్వారా ఆసుపత్రి వెనుక భాగం ప్రాంతంలోని శిడగం వీధి, ఆకుల వీధి, బంగారమ్మ గుడి, ప్రియా గార్డెన్స్ ప్రాంతాలకు చెందిన వందలాది మంది రాకపోకలు సాగించేవారు. అంతటి ప్రాధాన్యత కలిగిన రెండు మార్గాల వద్ద బీఆర్‌టీఎస్ పనుల్లో భాగంగా గోడ నిర్మించారు. దీంతో స్థానికులు తమ నివాసాలకు చుట్టూ తిరిగి చేరాల్సి వస్తోంది. అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే సంబంధిత శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి రోడ్డు మార్గాలను గతంలో మాదిరిగా ఉండాలని పలువురు కోరుతున్నారు.



రెండు చోట్ల రోడ్లకు అడ్డంగా నిర్మించిన గోడలు



వినతులు స్వీకరిస్తున్న మేయర్ వెంకటకుమారి

జీవీఎంసీకి 82 వినతులు

వెంకోజీపాలెం, మార్చి 4 : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి నగర వ్యాప్తంగా 82 వినతులు వచ్చాయి. మేయర్ హరి వెంకట కుమారి వినతులను స్వీకరించారు. మూడు రోజుల్లో సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

జీవం ఉన్న పాటలకే గుర్తింపు

- తెలుగు సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ



అశోక్ తేజను సన్మానిస్తున్న కళాసాహితి సభ్యులు

భీమునిపట్నం, మార్చి 4 : జీవం ఉన్న పాటలే ప్రజల్లో శాశ్వతంగా వినబడతాయని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అభిప్రాయపడ్డారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని శ్రీనివాసా ఫంక్షన్ హాల్‌లో కళాసాహితి ఆధ్వర్యంలో జరిగిన మాట, పాట, ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సినిమా పాటలకు రాను రాను ఆదరణ తగ్గుతుందని ఆధరణ అనిపిస్తున్నప్పటికీ జీవమున్న పాటలు శాశ్వతంగా నిలబడతాయన్నది వాస్తవమన్నారు. తాను సినీ రచయిత కాక ముందే కవిగా ఎన్నో పాటలు రాసాను, పాడానని చెప్పారు.వాటిలో నేలమ్మ, నేలమ్మ, నేలమ్మ అంటూ నేల తల్లిపై రాసిన పాటకు తనకెంతో గుర్తింపు వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. చిత్ర పరిశ్రమలో తనకు దాసరి నారాయణరావు, మోహన్‌బాబు తదితర ప్రముఖులు అందించిన ప్రోత్సాహం మరువలేనిదని తెలిపారు. తాను వంగపండు అభిమానినన్నారు. అనంతరం నిర్వాహకులు అశోక్ తేజ దంపతులను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కళాసాహితి అధ్యక్షుడు పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి అడిదం సన్యాసిరాజు, గౌరవాధ్యక్షుడు రేలంగి వెంకట అప్పలనరసయ్య సాహితీప్రియులు అడిదం కిషోర్, కనకల సన్యాసినాయుడు, కాళ్ల సన్నీ, గాడు మురళీ, కనకేశ్వరరావు, నక్కాన ఉదయ్ కుమార్, జె. సుదర్శన్, సంకురుభుక్త జోగారావు, శ్రీను, పైడిరాజు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన వెస్టర్న్ ఆస్ట్రేలియా ప్రతినిధి

వెంకోజీపాలెం, మార్చి 4 : ఏయూను వెస్టర్న్ ఆస్ట్రేలియా గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ మేనేజర్ బ్రోడెరిక్ మోన్ క్రిఫ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం పూర్వ డీన్ ధనుంజయ రావుతో సమావేశమయ్యారు. ఏయూ వెస్టర్న్ ఆస్ట్రేలియా కార్నర్ ఏర్పాటు చేయడం, సంయుక్తంగా కోర్సుల నిర్వహణ, విద్యార్థుల భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించారు. ఏయూలో ఫార్మసీ కళాశాల, సైన్స్, ఆర్ట్స్, న్యాయ కళాశాల ప్రత్యేకతలను రిజిస్ట్రార్ వివరించారు. అనం తరం ఆయన ఏయూలో నూతనంగా నిర్మించిన ఎలిమెంట్ భవనం, ఆ హబ్‌లను సందర్శించారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏయూ తరఫున బ్రోడెరిక్‌ని రిజిస్ట్రార్ సత్కరించారు.

పలు ప్రాంతాల్లో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

సింహాచలం, మార్చి 4 : వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి సహ కరించాలని 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పలు ప్రాం తాల్లో పార్టీ నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నాయకులు రాజనాల సత్యారావు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ప్రజలకు మేలు : ఎమ్మెల్యే



మహిళకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పద్మనాభం, మార్చి 4 : వైసీపీ ప్రభుత్వ పాలనలో సామాన్యులకు ఎంతో మేలు జరిగిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు జగనన్న ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మనాభంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి కులం, మతం, పార్టీలతో ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు అందించామన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకువెళ్లామన్నారు.అనంతరం బీఆర్ తాళ్లవలసలో జలజీవన్ మిషన్ నిధులు 98.32 లక్షలు, కోరాడలో రూ.1.18 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించడానికి చేపట్టనున్న పథకాలకు భూమి పూజ చేశారు. అలాగే 750 మందికి జగనన్న కాలనీల్లో స్థలాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు పైడినాయుడు, నాయకులు శివరామకృష్ణ, రామేశ్వరరావు, ఆదిబాబు, ఈశ్వరరావు, పద్దు పాల్గొన్నారు.

కోర్టు ఫైలింగ్‌పై అవగాహన

సాగర్‌నగర్, మార్చి 4 : న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులకు క్లీనికల్ లీగల్ ఎడ్యుకేషన్ ప్రాక్టికల్ శిక్షణ అవసరమని, దీనివల్ల వృత్తిలో రాణిస్తారని ప్రముఖ న్యాయవాది నమ్మి శ్రీనివాసరావు అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాల యం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో కోర్టు ఫైలింగ్‌పై సోమవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూ తన చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు లీగల్ డాక్యుమెంట్‌లను అధ్యయనం చేయాలని సూచించారు. అనంతరం త్వరలో జరిగే ఆలిండియా బార్ ఎగ్జామినేషన్ (ఏఐబీఈ) పరీక్షలకు ఎలా సిద్ధం కావాలన్న అంశంపై న్యాయ నిపుణులు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ ఆర్. అనితారావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అభివృద్ధితోనే రాష్ట్రం వృద్ధి

వెంకోజీపాలెం, మార్చి 4 : సమాజంలోని ప్రతి వ్యక్తి అభివృద్ధితో రాష్ట్రాభివృద్ధి ముడిపడి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లమ్ అన్నారు. సోమవారం ఆయన అవర్ స్టేట్ - అవర్ లీడర్ ఇండియన్ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో టీఎల్ఎన్ సభా మందిరంలో పాలనలో కొత్త పంథా - సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ అన్న అంశంపై జరిగిన సదస్సులో మాట్లాడారు. ఆచార్య షారోన్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్, ఎమ్మెల్సీ రవీంద్రబాబు, ఆచార్య టి. తిమ్మారెడ్డి, శాంత మూర్తి, సురేష్ బేత తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకముందు అజయ్ కల్లమ్ ఏయూ వీసీ ప్రసాదరెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీసీ ఏయూలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆయనకు వివరించారు.

కార్మికుల శ్రేయస్సే లక్ష్యం : మేయర్

వెంకోజీపాలెం, మార్చి 4 : జీవీ ఎంసీలో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తూ సహజంగా మరణించిన కుటుంబాలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో ప్రజా ఆరోగ్య విభాగంలో కాంట్రాక్ట్ కార్మికులుగా విధులు నిర్వహిస్తూ మరణించిన కుటుంబాలకు ఆమె ఎక్స్‌గ్రేషియా అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకా రం ఫిబ్రవరి 18 నుంచి మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు జీవీఎంసీ నిధుల నుంచి సహజంగా మరణించిన వారికి రెండు లక్షలు, ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.ఐదు లక్షల మంజూరు చేశామని తెలిపారు. 2019 ఫిబ్రవరి 18వ తేదీ నుంచి ఇప్పటివరకు 174 మంది మరణించగా దరఖాస్తు చేసుకున్న 82 మంది కుటుంబ సభ్యులకు రెండు లక్షలు, ఐదు లక్షలు చొప్పున రూ.1.73 కోట్లు అందించామని చెప్పారు. మిగిలిన 92 మంది దరఖాస్తులను జోనల్ స్థాయి అధికారి ద్వారా విచారణ జరిపి ఎక్స్‌గ్రేషియో విడుదల చేస్తారని ఆమె తెలిపారు.

200 రోజులుగా నిర్విరామ భజనలు

సింహాచలం, మార్చి 4 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో 200 రోజులుగా నిర్విరామ భజనలు, సంకీర్తనలు సాగుతున్నాయి. నగరానికి చెందిన హిందూ ధర్మ ప్రచార సేవా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు మారుతీ సారథ్యంలో ప్రతిరోజూ ఉదయం సుమారు మూడు గంటల పాటు ఉత్తరాంధ్రలోని అనేక ప్రాంతాల నుంచి వచ్చిన భక్తబృందాలు పలు దేవుళ్లను స్తుతిస్తూ భజనలు చేస్తున్నారు. భజన బృందాలకు దేవాలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి, నిత్యాన్న ప్రసాద పథకం కింద భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

అప్పన్నను దర్శించుకున్న షిర్డీ సాయిరామ్ గురూజీ

సింహాచలం, మార్చి 4 : వరాహలక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఉదయం షిర్డీకి చెందిన సర్వం శ్రీసాయిసేవా ట్రస్టు వ్యవస్థాపకుడు సాయిరామ్ గురూజీ తమ పరివారంతో దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ పీఆర్‌ఓ ఆత్మీయ ఆహ్వానం పలికారు. అంతరాలయంలో పూజలు తరువాత గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

ఇరుకు రోడ్డులో సంతతో నిలిచిన ట్రాఫిక్

మద్దిలపాలెం, మార్చి 4 : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ రోడ్డులో సోమవారం నిర్వహించిన సంత వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ఇక్కడ ప్రతి సోమవారం నిర్వహించే సంతను యథావిధిగా నిర్వహించాలని సీఐటీయూ నాయకులు ధర్నా చేయడంతో సాయంత్రం మళ్లీ సంత పెట్టుకోవడానికి కార్పొరేటర్ అనుమతిచ్చారు. అయితే పిఠాపురం కాలనీ రోడ్డులో కాకుండా మాజీ ఎమ్మెల్సీ మాధవ్ ఇంటి ముందు సంత ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు ఇరుగ్గా ఉండడంతో స్థానికులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పిఠాపురంకాలనీ రోడ్డులో ఒకవైపు దుకాణాలు, మరోవైపు ఖాళీ రోడ్డు ఉండడం వల్ల పెద్దగా ట్రాఫిక్ సమస్యలు ఉండేవి కావు. కానీ మాధవ్ నివాసం రోడ్డులో రెండువైపులా నివాసాలు ఉండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. అంతేకాదు స్థానికుల ఆహ్లాదానికి ఏర్పాటు చేసిన పార్కుల్లో సంత నిర్వహణ పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గిరిజన ఉద్యోగులకు సన్మానం



నిర్వాహకులతో సన్మానం పొందిన గిరిజన ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ, మార్చి 4 : నగరంలోని పలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న గిరిజన రిటైర్డ్ ఉద్యోగులను గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సోమవారం సన్మానించింది. ఎంవీపీ కాలనీ గిరిజన్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని పెందుర్తి ఏరియా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నిర్వహించింది. ముఖ్య అతిథిగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ హాజరయ్యారు. సుదీర్ఘ కాలం పలు ప్రభుత్వ సంస్థల్లో సేవలందించిన తాంగుల రంగారావు, తలారి చిట్టమ్మ, లంపిముఖి సత్యారావు, జంపరంగి నారాయణరావును ఘనంగా సత్కరించారు.

విమ్స్‌లో ఉచిత వైద్య శిబిరం రేపు

ఆరిలోవ, మార్చి 4 : విమ్స్‌లో బుధవారం ప్లాస్టిక్ సర్జరీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుందని చెప్పారు. శిబిరంలో గ్రహణం మొర్రి, డయాబెటిక్, పురుషుల్లో రొమ్ము గ్రంధి పెరుగుదల, బొదకాలు కీలాయిడ్ చికిత్స చేసి, మందులు అందిస్తామన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

భీమునిపట్నం, మార్చి 4 : పట్టణంలోని ది సన్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వందకు పైగా నమూనాలను ప్రదర్శించారు. వీటిని స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు.

సీఎం పర్యటనకు భారీగా బందోబస్తు

సాగర్‌నగర్, మార్చి 4 : విజన్ విశాఖకు వేదిక కానున్న రాడిసన్ బ్లూ హోటల్ వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సదస్సుకు హాజరవుతున్న ముఖ్యమంత్రి జగన్ రెండు రోజుల పాటు ఈ ప్రాంతంలో విడిది చేయనుండడంతో భారీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. బీచ్ రోడ్డు పొడవునా పోలీసులు పహారా కాస్తున్నారు.

కళాభారతి రోడ్డులో సంత కొనసాగించాలని ధర్నా

సిరిపురం, మార్చి 4 : పిఠాపురం కాలనీ కళాభారతి రోడ్డులో కార్పొరేటర్ మూర్తి యాదవ్ తొలగించిన సంతను, తోపుడు బండ్ల వ్యాపారాలను కొనసాగించాలని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కోశాధికారి వి. కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ నాయ కులు సంత వ్యాపారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా 200 కుటుంబాలు తోపుడు బండ్లు, నేలపై వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారన్నారు.కార్పొరేటర్ వాటిని తొలగించడాన్ని తప్పుపట్టారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వ్యాపారులకు ఉపాధి కల్పిస్తూ నిర్ణయం తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాస్

అక్రమార్జనే జీవీఎంసీ పాలకవర్గం ధ్యేయం

- టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పాలకవర్గంలోని వైసీపీ పెద్దలు అక్రమార్జనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆరోపించారు. సోమవారం ఆయన జీవీఎంసీలోని తన ఛాంబర్‌లో మాట్లాడారు. ప్రజలకు అవసరమైన పనులతో పాటు మౌలిక వసతుల కల్పనకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ తమ జేబులు నింపే పనులకే నిధులు కేటాయిస్తున్నారన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఇలాంటి పనులకు ప్రతిపాదనలు పెడితే తాము అడ్డుకుంటామన్న భయంతో స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదింపజేస్తున్నారన్నారు. రూ. 50 లక్షలు లోపు పనులను మాత్రమే స్టాండింగ్ కమిటీలో పెట్టాల్సి ఉండగా, రూ. రెండు కోట్ల విలువైన పనులను కూడా పెట్టి ఆమోదింపజేసుకుంటున్నారన్నారు. కొన్ని పనులకు పరిపాలనా ఆమోదం లభించకపోయినా పనులను పూర్తి చేస్తుండడం పాలకవర్గం అవినీతికి అద్దంపడుతోందన్నారు. దీనిపై అభ్యంతరం తెలపాల్సిన కమిషనర్ కూడా వారి అవినీతికి అండగా నిలుస్తున్నారని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే జీవీఎంసీలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపిస్తామని హెచ్చరించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ పాతజైలు రోడ్డులోని ఫుడ్‌కోర్ట్‌ను తొలగించాలని కౌన్సిల్‌లో తీర్మానం చేసి పది నెలలు గడుస్తున్నా ఇంతవరకూ తొలగించలేదన్నారు. తక్షణమే ఫుడ్‌కోర్ట్‌ని తొలగించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. 67వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక హౌస్ కమిటీలోని స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు ప్లాన్ లేదన్న సాకుతో వంద శాతం ఎక్కువ ఆస్తిపన్ను విధిస్తున్నారని, తాజాగా ఆయా ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం పట్టాలు జారీచేసినందున ఆస్తిపన్ను తగ్గించాలని కోరారు. వారితో పాటు కార్పొరేటర్లు జగన్నాథం, రౌతు శ్రీనివాసరావు, పీవీ నరసింహం ఉన్నారు.

యువత భవితే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర వృత్తి నైపుణ్యాభివృద్ధి, శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్

కొమ్మాది, మార్చి 4 : సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యువత ఆంధ్రాలోనే ఎక్కువగా ఉన్నారని, వారికి మంచి భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం భవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర వృత్తి నైపుణ్యాభివృద్ధి, శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన పీఎంపాలెం వి. కన్వెన్షన్ హాల్లో ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈఓ డాక్టర్ వి. వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 192 స్కిల్ హబ్స్ స్థాపించామని, 84 ఐటీఐ, 84 పాలిటెక్నిక్ కాలేజీలను ఆధునికీకరించామని చెప్పారు. 15,50,000 మందికి శిక్షణ ఇవ్వడం ద్వారా 3 లక్షల 70 వేల మందికి ఉపాధి కల్పించామన్నారు. 13 ఉమ్మడి జిల్లాల్లో ఎంపీ లాడ్స్ నిధులు రూ. 70 లక్షలు చొప్పున కేటాయించి నైపుణ్య శిక్షణ కేంద్రాలను నిర్మిస్తున్నామని, అందులో పది భవన నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. అలాగే 202 పరిశ్రమలతో సంప్రదింపులు జరపగా వాటిలో 158 పరిశ్రమలతో ఎంఓయులు జరిగాయన్నారు. మంగళవారం జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో పది కంపెనీలు ఎంఓయూలు చేసుకుంటాయని, భవిత కార్యక్రమానికి సంబంధించిన లోగో ఆవిష్కరణ ఉంటుందని వివరించారు.

కాపులు వైసీపీకి బుద్ధి చెబుతారు

- జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు



మాట్లాడుతున్న పంచకర్ల రమేష్‌బాబు

సిరిపురం, మార్చి 4 : వచ్చే ఎన్నికల్లో కాపులు వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. సోమవారం మేఘలయా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి కులం వారితో పవన్‌కల్యాణ్‌ను తిటిస్తున్నారన్నారు. ఇప్పుడు కాపు కమ్యూనిటీతో ఆ పని చేయిస్తున్నారని, కాపు జాతికి మీరేమి న్యాయం చేశారని ప్రశ్నించారు. నిజంగా కాపుల మీద ప్రేమ ఉంటే కాపు జాతిని తిట్టవచ్చా అని అడిగారు. పవన్‌కు సినిమాల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని ప్యాకేజీ తీసుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. హరిరామ జోగయ్య తనయుడు సూర్యప్రకాష్ ఏ ప్యాకేజీ కోసం వైసీపీలో చేరాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు చోడవరం నాయకుడు రాజు, కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఉన్నారు.

జాబ్‌మేళాలో 252 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, మార్చి 4 : మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 252 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మేళాలో 15 కంపెనీలు పాల్గొనగా 611 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇంటర్వ్యూల్లో 252 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎంపిక కానివారు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా మళ్లీ జరిగే జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జయ, పోల ఉమామహేశ్వరరావు, గోపాలనాయుడు పాల్గొన్నారు.

కరాటేలో భీమిలి క్రీడాకారులకు పతకాలు

భీమునిపట్నం, మార్చి 4 : నిడదవోలులో ఆంధ్రప్రదేశ్ గొజూర్యూ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆంధ్రా-తెలంగాణ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో మంగమారిపేట జెన్ షిటోర్యూ కరాటే అసోసియేషన్ క్రీడాకారులు పలు పతకాలు సాధించారు. ఈమేరకు అసోసియేషన్ కోచ్ వాసుపల్లి శ్రీహరి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలికల విభాగంలో వాసుపల్లి భారతి, కారి దేవి కటా, కుమిటి విభాగాల్లో బంగారు పతకాలు సాధించగా బాలుర విభాగంలో సంసాని శరణ్ స్వర్ణం, ఇప్పిలి మోహిత్ రజత పతకాలు పొందారని చెప్పారు.

ఆక్రమణలు తొలగించకపోతే చర్యలు

భీమునిపట్నం, మార్చి 4 :పట్టణంలోని 3వ వార్డు నేరేళ్లవలస కాలనీలో రహదారిపై ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలని జోనల్ అధికారులు స్థానికులను ఆదేశించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆ కాలనీవాసులు రహదారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జడ్సీకి ఫిర్యాదు చేశారు. ఈమేరకు జోనల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ డి. శ్రీనివాసరావు కాలనీకి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. రహదారికి అడ్డంగా చెట్లు, మొక్కలు పెంచుతూ, దడి కట్టిన వారిని పిలిచి మాట్లాడారు. తక్షణమే ఆక్రమణలను తొలగించా లని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'లైంగిక వేధింపులను అరికట్టాలి'



మాట్లాడుతున్న నరవ ప్రకాశ్

ఆరిలోవ, మార్చి 4 : మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరవ ప్రకాశ్ అన్నారు. సోమవారం ఆయన చినగదిలి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల గృహంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు.